# ప్రసన్నకి - ప్రేమతో

## ( నాటకం )

రచన : శంకరమంచి పార్థసారథి

### ఇందులో పాత్రలు

| | | | |
|---|---|---|---|
| 1. | రామాంజనేయులు | - | పోలాప్రగడ జనార్ధన్‌రావు ( జెన్నీ ) |
| 2. | లోకనాథం | - | శ్రీ విశ్వమోహన్ |
| 3. | ఎం.వర ప్రసాదం | - | శ్రీ రాజీవ్ కనకాల / ఫణి ప్రకాష్ |
| 4. | దొంగరాముడు | - | శ్రీ సుందరం / మోహన్ / జయచంద్ర |
| 5. | వెంకటప్పయ్య | - | శ్రీ కె.వి.రెడ్డి / రాజారావ్ / శివన్నారాయణ |
| 6. | వాణి నాథం | - | శ్రీ చలపతిరావు / భరద్వాజ |
| 7. | ప్రసన్న | - | శ్రీమతి లలితా రాజ్ / శ్రీమతి భార్గవి / శ్రీమతి వాణి |

**మధ్య తరగి ఇంట్లో  ఓ గది.**

సాధారణ  అలంకరణ  కనిపిస్తోంది. గోడలకి  క్యాలండర్లు  కుర్చీలు, బల్లలు దుమ్ము కొట్టుకు పోయి కనిపిస్తున్నాయి.

ఆ గదిని  చూసి ఆడదిక్కులేని సంసారం  అని ఇట్టే చెప్పొచ్చు.

తెర తీసేసరికి, స్టేజీ ఖాళీగా వుంది.

లోపలనుండి తండ్రీ కొడుకుల ఘర్షణ  వినిపిస్తోంది.

రేయ్ వరం,  ఆగరా  నా బాబువి  కదూ అని  రామాంజనేయులు అంటున్నారు. నేనాగను. నాకొద్దు వుత్తినే హైరానా పడకు  అంటున్న వరప్రసాదం  గొంతు గొడవ గొడవగా ఒకటి రెండుసార్లు  వినిపించాక  వరప్రసాద్  చిన్న టవలు  చుట్టుకొని  స్టేజీ పైకి పరుగెట్టుకుంటూ  హడావిడిగా వచ్చి తండ్రి  బారినుండి  తప్పించుకునేటందుకు దాగటానికి  తగిన స్థలం  గురించి  అటూ ఇటూ  చూస్తుండగా ఆ వెనకే రామాంజనేయులు  అదే ఫోర్సుతో అక్కడికి  రావటం, వరప్రసాదం  వులిక్కిపడి  తండ్రికి దొరక్కుండా స్టేజంతా తిరుగుతున్నాడు. రామాంజనేయులు  తనయుడిని బతిమాలుకుంటున్న ధోరణిలో......

రామం :  ఒరే, నా మాట  విను.నా తండ్రివి కదూ, ఇవ్వాళ నీ పుట్టిన రోజురా, మీ అమ్మే బతికుంటే ఎంత హడావిడి చేసేదో, బంగారు  కొండవి కదూ. ఈ కాస్త చవురు నెత్తిన పెట్టనియ్యి.

వరం : ( అందకుండా దూరంగా పారిపోతూ )  నాన్నా ఏమిటి అల్లరి ?  అయినా నెత్తిన చమురు  పెట్టటానికి, గోరు ముద్దలు తినిపించటానికి  నేనింకా  అడ్డాల్లో బిడ్డననుకుంటున్నావా, గడ్డాలు మీసాలువచ్చి  గడకర్రలా  ఎలా పెరిగానో చూడు. అంచేత పాత  అలవాట్లుకు అఆచారాలకి  గుడ్ బై – తప్పుకో నే బాత్ రూంకి వెళ్ళాలి.

రామం : ఓహెూ అంటే నామాట వినవా, సరే, రేయ్ నేన్నీ తండ్రినిరా పట్టుదల్లో
నీకన్నా రెండాకులు ఎక్కువ చదివా తెల్సా ? ఎలా తప్పించుకుంటావో నేనూ
చూస్తాగా – ( రామాంజనేయులు ఎడ్వాన్స్ అవగా, వరం మళ్ళీ పైనుంచి దూకి
దొరక్కుండా మరో వైపుకి పరుగెత్తాడు )

వరం : నాన్నా, ప్లీజ్ అక్కడ ఆగిపో ! వంటరివాడిని పైగా ఏక వస్త్రుని ఇలా బలవంతం
చేయటం న్యాయం కాదు. ప్రయత్నం మానుకోకపోతే పోలీసు రిపోర్టు ఇస్తా.
తర్వాత నీ యిష్టం.

రామం : పోలీసు రిపోర్టు ఇస్తావా ? ఇయ్యి – నురుగు పోసేందుకు మనిషి సాయం
లేదని వర్రీ అవుతున్నా. వెధవ బెదిరింపులు నువ్వూన్నూ ఆగక్కడ.
( ఇద్దరూ స్టేజిపైన రౌండ్లు కొడుతున్నారు )

వరం : సరే సరే, ఎంతైనా తండ్రివిగదా, ఇద్దరం ఓ వప్పందానికి వచ్చి సంధి పత్రంపైన
సంతకాలు చేసుకుందాం.

రామం : అలారా దారికి – ఏమిటో చెప్పు.

వరం : నీ నెత్తిన చవురు పెట్టించుకుని తలంటుకూడా .... పోయించుకుంటా ఇన్క్లూడింగ్
వీపురుద్దటం, సరేనా ?

రామం : మరింకేం – పద.

వరం : ఆగాగు. పూర్తిగా విను కాని నువ్వు నాకు ఓ పచ్చనోటు ఇచ్చుకోవాల్సి వుంటుంది.

రామం : పచ్చనోటా ? అంటే వంద. అమ్మో దేనికిరా అంత డబ్బు ?

వరం : మరి నా పుట్టిన రోజు అంటే అందరూ గ్రీటింగ్స్ చెప్పటానికి వస్తారా ?
వాళ్ళందరికి ఈ కాఫీ, టీ, టిఫినన్నా ఇప్పించాలా. రామాంజనేయులు గారి అబ్బాయి
వరప్రసాదం కేవలం థాంక్స్ చెప్పి పంపించాడు అనుకుంటే
నీకెంత నామోషీ ?

రామం : ( ఆలోచించి ) సరే – ఓ పఙ్జెయ్యి

వరం : ఏమిటీ ? చెక్కు రాసిస్తావా ? బ్యాంకుకి వెళ్ళిరానా .

రామం : అదేం కాదు. అందర్నీ రానియ్యి పప్పు బెల్లాలు నే పంచి పెడతాగా.

వరం : పప్పు బెల్లాలా ? జెండా గూడా ఎగరేస్తావా ?

రామం : సరేపోనీ – చాక్లెట్లు పంచిపెడదాం సరేనా ?

వరం : అతేగాని గబ్బులు మాత్రం ఇవ్వనంటావ్ ?

రామం : డబ్బు పాపిష్టిదిరా పిల్లల్ని పాడుచేస్తుంది. సర్లే త్వరగా పద. అక్కడ నీళ్ళు చల్లారిపోతూన్నాయి. వూ...

వరం : ఆగక్కడ డబ్బు మొహం తెలవకుండా నన్ను ఈ విధంగా ఎంతకాలం పెంచాలనుకుంటున్నావు. బ్లేడు కావాలి నాన్నా అంటే బ్లేడు తెచ్చిస్తావా . పుసక్తం అంటే పుస్తకం తెచ్చి చేతికిస్తావా. చెప్పులు, బట్టలు చివరకి సెలూన్లో గోరిగించుకున్నా నువ్వే వచ్చి పేమెంటు చేస్తావు గానీ, డబ్బులు మాత్రం చేతికిచ్చి ఎరగవు. అవునా.

రామం : అవసరాలు తీరుతున్నప్పుడు డబ్బుతో నీకేం పన్రా. నువ్వడిగింది నేనెప్పుడైనా కాదన్నానా ? సరే పార్టీ గురించేగా

వరం : హమ్మయ్య అయితే ఒప్పుకున్నట్టేనా ?

రామం : నీ పేర్న ఇవాళ గుళ్ళో భోగం చేయిస్తున్నారా .... అందర్ని అక్కడికి రమ్మను. పులిహార ప్రసాదం పెడదాం.

వరం : ఛీ, ఛీ నే బతికుండగా నువ్ మారవ్

( వరం ఆవేశంగా లోనికి వెళ్ళాడు. రామాంజనేయులు చేతిలో చమురుతో ఫాలో అయ్యారు. లోపల తిరిగి ఘర్షణ వినిపిస్తోంది )

రామం : ఛ,ఛ అవ్వేం మాటల్రా, తప్పు కదూ ఆగరా అయినా ఇంత ఆగడం పనికిరాదురా.

( దొంగరాముడు బయటినుంచి ప్రవేశించాడు. ఇంటిని నాలుగవైపులా పరిశీలనగా చూశాడు. తర్వాత లోపలినుంచి వినిపిస్తున్న మాటల్ని ఆసక్తిగా ఆలకిస్తున్నాడు )

వరం : నువు నాతో మాట్లాడొద్దు అంతే వెళ్ళి వంటపని చూసుకో

రామం : అంతేనా ? నామాట వినవా ?

వరం : విననుగాక వినను. అంతే తప్పుకో .

రామం : నువ్వు మంచికి మనిషివి కాదురా. నాయనా బాబూ అంటుంటే

వరం : నాన్నా ఏమిటా పరుగు పిచ్చికుక్క వెంట పడ్డట్లు . కాల్జారితే అసహ్యంగా వుంటుంది ఆగిపో.

( స్టేజిపైన దొంగరావుడికి వాళ్ళిద్దరూ ఆవైపుగా వచ్చే సూచన్లు కనిపించినాయి కాబోలు. వెళ్ళి టేబిలు వెనకనక్కటం జరిగింది. రామాంజనేయయులు చేతిలో చమురుతోపట్టువదలని విక్రమార్కుడిలాగా రివ్వన వచ్చాడు. కొడుకు గురించి నలువైపులా చూశాడు. సోఫా వెనక నక్కి కూర్చున్న దొంగరావుడి జుట్టు ఆయన కంటపడగా మెల్లి మెల్లిగా ఆ వైపుకి ఆడ్వాన్స్ అయి, చేతిలో వున్న చవుర్ని దొంగరావుడి నెత్తిన మెత్తుతూ విజయగర్వంతో )

రామం : నక్కి కూర్చుంటే కనిపెట్ట లేననుకున్నావా ? నీ కన్న తండ్రినిరా తెల్సా ?

( ఆ మాటకి దొంగరావుడు సోఫా వెనక నుంచి లేచి నిల్చుంటూ )

దొంగా : నువ్వా నా తండ్రివి - నాన్నా ?

వరం : భలే, భలే నే గెల్చానాన్నా, నే ఇక్కడున్నా

రామం : ఇతనెవడు. ఎవర్రా నువ్వు ? ఇక్కడేం చేస్తున్నావ్ ?

దొంగ : పోగొట్టుకున్న లాకెట్టుని వెతుక్కుంటున్నా తప్పుకోండి.

రామం : ఇదిగో పిచ్చి పిచ్చి వేషాలు కట్టి పెట్టి బయటిక నడు. సరాసరి ఇంట్లోకి వచ్చింది కాకుండా తప్పుకోవాలట.

వరం : నాన్నా నువ్వాగు. చూడండి - చిన్న అనుమానం మీ లాకెట్టు మా ఇంట్లో ఎలా పోతుంది. అసలు మీరు మా ఇంటికి ఇదేగా రావడం.

దొంగ : కాదు. రాత్రి వచ్చాగా డ్యూటీమీద

రామం : డ్యూటీమీదా ? ఏం డ్యూటీ ? అసలు నీపేరేంటి .

దొంగ : దొంగరాముడు

వరం : ఏం చేస్తుంటారు ?  వ్యాపారమా ?

దొంగా : అదీ వ్యాపారం లాంటిదే – దొంగతనాలు అని గిట్టని వాళ్ళంటారు.

రామం : దొంగతన్నాలా ? చూస్తావేరా బయటికి నెట్టు  వెధవని

( దొంగరాముడు ఆవేశంగా  చెయ్యి ఎత్తి ఏదో ఆలోచనగా )

దొంగ : ఇవ్వాళ ఏ వారం ?

వరం : మంగళవారం  అండీ. ఏం మగాళ్ళని ముట్టుకోరా ?

దొంగ : ముట్టుకుంటాగాని కొట్టను, బతికి పోయావ్ – తప్పుకో

రామం : ఇదెక్కడి సంతరా – ఇదిగో మర్యాదగా బయటికి పోతావా లేదా ? నిన్నే

దొంగ : నేనేం  ముష్టి వెధవననుకుంటున్నారా ? దొంగరాముడ్నిరా. దొంగరాముడిని
దొంగతనాలు  చేసుకుంటూ  దర్జాగా తలెత్తుకు బతికేవాడ్ని.

వరం : అంటే రాత్రి మా ఇంటికి  దొంగతనానికి .

దొంగ : వచ్చారా. అదే చెప్పేది అదిగో అక్కడ కూర్చుని  బిర్యాని  తిన్నా, ఇటొచ్చి బీరుతాగి
ఆ తర్వాత అలా బాత్‌రూంకి – అవున్రా – ఆ బాత్‌రూం అంత కంపుకొడుతోంది
ఏడాదికొకసారి గాని కడగరా.

వరం : అలా చెప్పండి – ఎంతసేపూ  తలంటుతానంటూ నా వెంట పడతాడే గానీ
బాత్‌రూంగురించి పట్టించుకోరండి,
నాన్నా  అదీ విషయం  రాత్రి మనింటికి దొంగతనానికి  వచ్చార్ట.
లాకెట్టు పోగొట్టుకున్నారట.

రామ : దొంగతనానికి  వచ్చి పోగొట్టుకున్న  వాడిని ఇదే చూట్టం.

వరం : అవునండీ  రిస్కు తీసుకొని  మరీ వచ్చారు. ఆ లాకెట్టు అంత గొప్పదా .

దొంగ : మా అమ్మ స్వయంగా  నా మెళ్ళో కట్టి కళ్ళు మూసింది. అది నామెళ్ళో
వున్నంతకాలం  నిన్నెవరూ  ఏం చెయ్యలేరు అని గూడా చెప్పింది. అందుకే ఆ
లాకెట్టు అంటే నాకెంతో ఇష్టం.
( దొంగరాముడు  కళ్ళు తుడుచుకుంటూ  వేరే గదిలోనికెళ్ళాడు. రామాంజనేయులు
కంగారుగా )

రామం : ఇదిగో ఆగు. నిన్నే అటెక్కడికయ్యాబాబూ

వరం : నాన్నా పాపం తల్లిలేని దొంగ పోనిలే అయినా గాంధీగారి పుట్టినరోజునాడు దొంగల్ని వదిలేస్తారు. నా పుట్టిన్రోజునాడు కనీసం ఒక్క దొంగని ఫ్రీగా తిరగనిద్దాం.

రామం : సరే అయితే మరి నాచేత తలంటు పోయించుకుంటావా .

వరం : అమ్మ ! మళ్ళీ ఆ పాయింటుకి వచ్చేవా నావల్లకాదు.

( పారిపోయాడు లోనికి రామాంజనేయులు వెంట పడ్డారు )

రామం : ఆగరా నిన్నే వరం

( ఇపుడు స్టేజీ ఖాళీగా వుంది ప్రసన్న బయటి నుంచి వచ్చింది. అటు ఇటు చూసి సందేహంగా తనలో తను అనుకుంటుంది )

ప్రసన్న : వరం లోపలున్నట్టున్నాడు – పుట్టిన రోజు గిఫ్టుగా ఓ పెద్ద సర్‌ప్రైజిస్తే పోలా .

( అనుకుని ఆయింటి మనిషిలాగా బోడ్లో చీర దోపుకుని అక్కడున్న కుర్చీల్ని, బల్లల్ని పెద్ద శబ్దం చేస్తూ సర్దుతోంది )

( దంగరాముడు గదిలోనించి వచ్చారు. ఆమెను చూశాడు అతనికేం అర్థంకాక తన దారిని తను వెతుక్కుంటున్నాడు. బల్లక్రింద అతనికి ఒక పల్చటి కార్డు కనిపించింది. దాన్ని తీసుకుని పరీక్షిస్తుండగా, రామాంజనేయలు లోపల నుండి వచ్చాడు. )

రామం : ఎవరది ? ఎవరమ్మ నువ్వు ?

( ప్రసన్న తన ప్లాన్ అప్సెట్ అయినందుకు కంగారు పడింది. ఏం చెప్పాలో అని సంకోచిస్తుండగా దొంగరాముడు తన చేతిలో కార్డుని ఆయనకిచ్చి, తన దారిన తను వెతక్కుంటున్నాడు. ప్రసన్న కంగారుని చూశాడు. తర్వాత చేతిలో కార్డు చదవాడు )

రామం : ఈ పిల్ల పుట్టుమూగ. చాలా పేదకుటుంబం ఆపరేషన్ చేయించుకోటానికి డబ్బులు పోగు చేసుకుంటుంది. మీకు తోచినంత సహాయం చేసి ఈ నిర్భాగ్యురాలిని ఆదకోండి ఓహెూ నిన్న కార్డిచ్చి వెళ్ళింది నువ్వేనా ? అలా కూర్చో.

( ప్రసన్న అయోమయంగా ఆయనవంక చూసి ఏదో చెప్పబోయి చేతులుతిప్పింది )

రామం : అర్థమైంది కార్డు చదివాగా బంగారం లాంటి పిల్లవి నిన్ను మూగని చేయటానికి ఆ దేవుడికి మనసెలా వచ్చిందో ?

( ప్రసన్నకి పరిస్థితి అర్థమైంది. అంచేత ఆ ఫక్కీలో చేతులు తిప్పి నటిస్తోంది )

రామం : ఏం కావాలి? ఆపరేషన్ చందానా ?ఇవ్వాళ మా అబ్బాయి పుట్టిన్రోజు. ఓక్షణం ఆగు ( లోనికెళ్ళాడు )

వరం నాన్నా వరం. స్నానం అయిందా ?

( వరం ఇంకో గదిలోంచి వస్తూ )

వరం : ఏంటా కేకలు ఇక్కడే వున్నాగా

( ప్రసన్నను చూశాడు షాకయ్యాడు ) ప్రసన్నా నువ్వా ? ఎంతసేపయ్యింది వచ్చి ?

ప్రసన్న : రెండు రోజుల్నుంచీ దొరగారి దర్శనం కాకపోతేనూ కల్సిపోదామని ఇలా వచ్చా. పైగా పుట్టిన్రోజు కూడా.

వరం : సాయంత్రం కలుద్దాం. నాన్న వచ్చేస్తున్నారు. నువ్వెళ్ళు ఊ....

రామం : నువ్వక్కడే వున్నావా ? రేయ్, ఈ అయిదు రూపాయలు ఆ పిల్లకియ్యి

వరం : అయిదు రూపాయలు, నాన్నా ,....ఎవరనుకుంటున్నావ్ ?

( ప్రసన్న ఏదో సంజ్ఞ చేసింది. వరానికి అర్థం కాలేదు )

రామం : నాకు తెలుసు లేరా. మూగ పిల్ల ఆపరేషన్కి చందాలు పోగు చేసుకుంటుంది ఆ పిల్లకిచ్చి కృష్ణార్పణం అను....ఊ...ఇదిగోనమ్మా నీ కార్డు.

వరం : కార్డా ? ఏం కార్డు ?

దొంగ : తప్పు కోండ్రా అలా లోనికెళ్ళి మాట్లాడుకోండి. చూడమ్మా పరిస్థితి అర్థమయిందిగా. ప్రస్తుతానికి అయిదు రూపాయలే వరప్రసాదమనుకుని వెళ్ళు...ఊ...

( ప్రసన్న సరేనన్నట్లు తలూపింది చేయి చాపింది. వరం నోటుని ఆమెకిచ్చాడు )

రామం : ఏమిటో పాపం అసలే ఆడపిల్ల పైగా వయసులో కూడా ఉంది. నీకు అమ్మా నాన్నావున్నారా ?

( ప్రసన్న తలూపి సంజ్ఞ చేసింది )

వరం : వున్నారట. పైగా వాళ్ళది చాలా గొప్ప ఫ్యామ్లీ నాన్నా

రామం : కార్డు చదివా గాని నోటికొచ్చినట్లు వాగకు.

ఇలాంటి వాళ్ళకి సహాయం చేస్తే దేవుడు మెచ్చుకుంటాడు.

దొంగ : అయితే ఇంట్లో వుంచుకుని వైద్యం చేయించు.

వర ప్రసాద, స్వామి ....సంతోషిస్తాడు.

రామం : ఆయనెవరు ?

వరం : వాళ్ళ వూరు దేవుడ్లే ....నాన్నా నువ్వెళ్ళి ఆ బట్టలపని చూడు అన్ని వివరాలు

కనుక్కుంటానుగా వూ...

రామం : చూడమ్మా మీ వాళ్ళని వచ్చి నన్ను కలవమను. నాకు తెల్సిన మంచి

డాక్టరున్నాడు. నేను చెపుతాను సరేనా.....( ప్రసన్న సరే అన్నట్లు తలూపింది )

వరం : సరే అందిగా ....ఇంక నువ్వెళ్ళు ...ఈ పిల్ల సంగతి నే చూసుకుంటానన్నగా నే

వెళ్ళి దగ్గరుండి ఇంటి దగ్గర దింపి వస్తా.... దేవుడు సంతోషిస్తాడు.

రామ : నోరు మూసుకుని లోపలికి పద... వయసొచ్చిన పిల్లని వెంట బెట్టుకుని

వీదుల్లో తిరిగితే నలుగురూ ఏమనుకుంటారు ? జాగ్రత్తగా వెళ్ళి రామ్మా వెళ్ళు.

దొంగ : ఏరా అయిందా ? తప్పుకోండ్రా

( ప్రసన్న వరం వంక చూసి వెనక్కి తిరిగింది. లోకనాథం భుజానికి సంచి

తగిలించుకుని లోనికి కంగారుగా వస్తూ ప్రసన్నని డాష్ కొట్టాడు. ఇద్దరూ

కింద పడ్డారు ప్రసన్న భయంగా లోక్ నాథం వంక చూసింది లోకనాథం తన కళ్ళని

తను నమ్మలేనట్టు ఆమె వంకే చూస్తున్నాడు. ఇద్దరు మెల్లిగా లేస్తున్నారు.

సినిమాలోని ఓపాట తాలూకు చరణం వినిపిస్తోంది )

రామం : ఏమిటా పరుగులు కొంపలు ముంచుకు పోతున్నట్లు వెనకాముందు

చూసుకోవద్దూ. దెబ్బలు తగిలాయమ్మ.

వరం : మావయ్యా, నాన్నకి జబ్బేదైనా మొదలైందా ? ఏవిటా చూపులు ? నిన్నే....

దొంగ : తప్పుకోండ్రా .....మిమ్మల్నేరా... తప్పుకోండి.

లోక : అంతా అయోమయంగా వుంది. ఇది నిజమేనా ? కలకాదుగా....

రామం : వెధవ పైత్యం వాగుడు. నువ్వెళ్ళమ్మా ఏం అనుకోకు. మీ వాళ్ళని తీసుకురా ఏం ...

లోక : బావా ? ఎవరీ పిల్ల ? మీ వాళ్ళని తీసుకురా అంటున్నావ్...

( ప్రసన్న చేతిలో కార్డు లోకనాధానాకిచ్చి వరంవైపు ఒక చూపు విసిరి బయటికెళ్ళిపోయింది. లోకనాథం కార్డు చదివి, జాలిగా ....)

లోక : మూగపిల్లా – బావా నిజంగానా ? ఏరా వరం

రామం : జాలి పడటం కాదు. చేతనైతే సాయం చేసి ఆపరేషన్ చేయించాలి. అయ్యో కార్డు మర్చిపోయి వెళ్ళిందే ?

దొంగ : మళ్ళీ వస్తుందిలే తప్పుకోండి వూ...

లోక : వస్తే బావుండు నేనూ అయిదో పదో ఇస్తా...

వరం : మావయ్యా అందరూ ఇష్టంవచ్చినట్లు మాట్లాడకండి.

రామం: ఏవిట్రా ఏమైంది దేనికా అరుపులు

దొంగ : చెప్పలేని చోట చీమ కుట్టినట్టుంది.

లోక : బావా ఎవరాయన ? ఇంటి మంగలా ?

రామం: చెప్తాగాని –ఏమిటి చెప్పా పెట్టకుండా వూడిపడ్డావు. మళ్ళీ మీ అక్క కల్లో కనిపించి మీ బావ ఎలా వున్నారో, చూసిరా అంటూ అడిగిందా .

లోక : ఎక్కం చెప్పినట్లు చక్కగా చెప్పావ్. కాని అంత తేలిగ్గా తీసి పారెయ్యకు. ముఖ్యమైన పనిమీద వచ్చా.

రామం :  ఏం ప్రన్నా, పొలం  అమ్మకానికి పెట్టావా ?

లోక   : ఇంకా లేదు బావా. సంగతి  ఏంటంటే  ఉద్యోగాలకోసం తిరిగి తిరిగి విసుగెత్తి చిన్న వ్యాపారం  పెడదామని  జాతకం చూపించా  ముందు  పెళ్ళి చేసుకో, తర్వాత వ్యాపారం  పెట్టమని  సలహా, కాబోయే  పిల్ల తనే  వచ్చి గుద్దుకుంటుందని కూడా చెప్పాడు. సరే పెద్ద వాడివిగదా  నీ చేతుల  మీదుగా ఓ ఇంటి వాడ్ని అవుదామని వచ్చా  నన్నాశీర్వదించు  బావా ?

రామం : శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు. మనో  వాంఛా ఫళ సిద్ధిరస్తు ? వెళ్ళి  స్నానం చెయ్యి. నేనీ  లోపల వంట పూర్తి చేస్తా.

( రామాంజనేయులు  లోనికి వెళ్ళాడు.  లోకనాధం  జేబులోంచి  సిగరెట్టు  తీసి పుచ్చుకొని  ఇల్లంతా పరీక్షగా చూసి, ప్రసన్న  నిల్చున్న చోటుకి  వచ్చి నిల్చుని పరవశంగా  అంటున్నాడు )

లోకం : ఆ కళ్ళు, ఆవళ్ళు ఆ చూపులు  – ఓహో  అంతా బొమ్మ  పైగా సిద్ధాంతిగారు చెప్పినట్లు తనే వచ్చి  గుద్దుకుంది – కాకపోతే  మూగది.

దొంగ : ఆగదిలోకి పోయి  మాట్లాడుకోరా. తప్పుకోరా నిన్నే....

లోకం : అదేమిటో  అంతా తప్పుకో  అనే వాళ్ళేగానీ, కలుపుకునే వాళ్ళే కనిపించటంలా....మీరూ

( వరం చొక్కా  గుండీలు  పెట్టుకుంటూ  బయటకి వచ్చి  లోనికెళ్ళబోతున్నాడు )

లోక   : ఎక్కడికిరా ....మార్నింగ్  షోకా ?

వరం  : అబ్బా అడిగావ్. పనిమీద  వెడుతున్నవాడిని ఎక్కడికి  అని అడక్కూడదని తెల్వదూ. ఛీ...ఛీ... ( కుర్చీలో  కూర్చున్నాడు )

లోక   : ఏమిట్రా  అంత చిరాకు  అంత ముఖ్యమైన  పనా ? అప్పు గురించా ? మొహమాటపడకు  పిచ్చిసన్నాసి చెప్పు.

వరం : మావయ్యా ఇవాళ నా పుట్టిన రోజు

లోక : అలాగా - అందుకనా ఇంట్లో - విషాదం తాండవిస్తోంది...ఎని హౌ కంగ్రాట్స్...

దొంగ : తప్పుకోండ్రా - ఇది ఇల్లా నిజాం కాలేజీ గ్రౌండ్సా ? ఎపుడూ మీటింగులే...

లోక : ఎవడ్రా ఆయన. గడియగడియకి తప్పుకో మంటాడు పైగా చిరాకు

వరం : తర్వాత చెప్తాగానీ...

మావయ్యా మరే - మరే నీ దగ్గర ఒక్క యాభై వుంటే ఇచ్చావనుకో. నువ్వు ఎళ్ళేలోపు పువ్వుల్లో పెట్టి ఇచ్చేస్తా... ప్రామిస్...

లోక : యాభై రూపాయలా ? పుట్టిన రోజున అప్పుచేస్తే మేనమామలకు కల్సి రాదని ఉపనిషత్తుల్లో రాసుందట టి.విటో చెప్పారు. నేనేమో ముఖ్యమైన పని మీద వచ్చా...అంచేత రేపు చూద్దాం గాని - ఏరా, నీటుగా డ్రెస్సప్పయ్యావ్, గడ్డం గీసావ్ - పైగా డబ్బులంటున్నావ్ అంటే మొదలైందన్నమాట.

వరం : ఏమిటి మొదలవటం ?

లోక : అదేరా లవ్ గేమ్ ప్రేమలాట ఎవర్రా ఆ పిల్ల పాపం ?

వరరం : అదిగో అదే నాకు మండేది. పాపం దేనికి ? నాకేం తక్కువ ?

లోక : సర్లేరా -అమ్మ పుట్టిల్లు మేనమామ దగ్గరాని - నాకంతా అర్ధమైంది ఇంతకీ ఆ పిల్ల పేరు ?

వరం : పేరు....పేరు....ప్రసన్న

దొంగ : ఏదో తప్పు చేసినట్లు ఆ గుటకలు మింగటం దేనికిరా ? మొగాడివి కాదూ.

లోక : ఎవడ్రా ఈయన పెద్దదిక్కులాగా పదే పదే తిడుతున్నాడు.

వరం : తర్వాత చెప్తాగాని...

మావయ్యా మరే నాకు నీ హెల్ప్ కావాలి.

లోక : అర్ధవైందిరా. మూడొంతు కథ అర్ధమైంది.

నువ్వో పిల్లని ప్రేమించావు. ఆపిల్ల పేరు ప్రసన్న కాని సంగతి పెద్దాయనకి చెప్పలేక అలాగని దాచుకోలేక నిండు గర్భిణీలాగ హైరానా పడిపోతున్నావ్. నీకోదారి చూపించాలి అంతేనా ?

వరం : ఆశ్చర్యంగావుందే ? కరెక్ట్ అంతే, అంతే

లోక : ప్రేమ గొడవల్లోనూ, డబ్బు గొడవల్లోనూ జాగ్రత్తగా వుండాలి. ఆలోచించి మాట్లాడాలి. ఇంకా జాగ్రత్తగా అడుగువెయ్యాలి. నాకు చెప్పుకున్నావ్. అదీ నీ అదృష్టం ఎంతయినా అక్క బిడ్డవి తప్పుతుందా ? సరే లోపలికెళ్ళి అగ్గిపెట్టి పట్టుకురా.

వరం : అగ్గిపెట్టా ? దానికీ నా ప్రేమకు ఏమిటి లింకు ?

దొంగ : లింకులేదు. బొంకూలేదూ ఆడికి అగ్గి పెట్టి కావాలి. అదీ సంగతి.

లోక : ఎవర్రా ఈయన పర్సనల్ గొడవల్లోకి పదేపదే వచ్చేస్తున్నాడు.

వరం : చెప్తాగానీ

అంటే లోపల నాన్నవున్నాడు. అగ్గిపెట్టి తేలేనని నీ ఉద్దేశం కదూ... చూస్తుండు క్షణంలో తెస్తా ( ఆవేశంగా లోనికి వెళ్ళాడు. లోకనాథం వెతుక్కుంటున్న దొంగరాముడిని పరిశీలనగా చూసి భక్తిగా )

లోక : మీరూ ?

( దొంగరాముడు అతని వంక ఓరగా చూసి, ఆట పట్టించడానికి నేలపైన పడుకుని నేలకి చెవుపెట్టి ఏదో వింటున్నాడు )

లోక : ఓహెూ – ఈయనెవరో భుగర్భ శాస్త్రవేత్తలా వుంది, పెద్ద పెద్ద వాళ్ళంతా చాలా సింపుల్‌గా వుంటారంటారు.

సార్ ఏమిటి సార్ వింటున్నారు. ఈ కొంపలో లంకె బిందులుగాని వున్నాయంటారా ?

( దొంగరాముడు సమాధానం చెప్పక, లేచి నిల్చుని ఏదో లెక్కలేసుకుంటు లోనికి వెళ్ళిపోగా లోకనాథం అయోమయంగా. )

లోక : ఎంత శాస్త్రవేత్తయినా ఓ ముక్క మాట్లాడొచ్చుగా
అయినా ఆయన చెప్పేదేమిటి నాకు చెవుల్లేకనా ?
( అని తనూ బొక్కబోర్లా పడుకుని వింటున్నాడు )
వరప్రసాదం అగ్గి పెట్టెతో వచ్చాడు. దృశ్యం చూసి ఆశ్చర్యంగా )
వరం : అదేమిటి మామయ్య, ఆ ఫోజు ఆర్మీ జవానులాగా
( లోకనాధం భక్తిగా భూమికి నమస్కారం చేశాడు. చేతులతో
కళ్ళకద్దుకుంటూలేస్తూ )
లోక : నీకేం తెల్సురా కుర్రకుంక ....భూమి తల్లి గొప్పది.
త్రికాలములయందు ఎక్కడున్నా ఇలా నమస్కారం చేసుకోవటం నాకలవాటు
సరే ఇంతకీ తెచ్చావా ? మీ నాన్నని ఎలా మేనేజ్ చేసావ్ .
వరం : వెరీ సింపుల్ .లోపలికి వెళ్ళి నాన్నా కళ్ళు మూసుకో అన్నాదేనికి రా ?
ముద్దెట్టుకుంటావా ? అన్నాడు. నువ్వెప్పుడూ ఇంతే అని చిరాకు నటించా.
దాంతో కంగారు పడి పిచ్చి వెధవ, అంతా మీ అమ్మ పోలికే. అంటూ కళ్ళు
మూసుకన్నాడు. అంతే చప్పున అగ్గిపెట్టి తెచ్చేసా.
లోక : సెంటిమెంటుతో సాధించావన్నమాట, ఫీల్డుకి పనిపకొస్తావు
( అని సిగరెట్టు వెలిగించాడు ) ఇంతకీ నువ్వు ప్రేమించిన పిల్ల మనవాళ్ళేనా ?
అదే మన కులమేనా అని.
వరం : వాళ్ళమ్మ మనదే. వాళ్ళ నాన్నే కాదు...
లోక : ఏమిటి కాదు. వాళ్ళనాన్న అమ్మకు మొగుడు కాదా ? ఈ పిల్లకి తండ్రి కదా ?
వరం : అబ్బబ్బ అదేం కాదు వాళ్ళది కులాంతర వివాహం. నాన్నకి తెలిస్తే వప్పుకోరు .
నాకు తెల్సు.
లోక : వూ... అయితే గట్టి ప్రయత్నమే చెయ్యాలి మరి. కాని నేనేమో నా పెళ్ళి
గొడవలోవున్నాను నా సంగతి చూసుకోనా ? నీ గురించి ఆలోచించనా ?

వరం : అంటే మావయ్యా ? నువ్ గూడా ఎవరినైనా ప్రేమించావా ? పేరేంటి ?

లోక : తెలీదు నీక్కాబోయే భార్య నన్నొచ్చి గుద్దుకుంటుంది అని సిద్దాంతి గారు చెప్పార్రా.

ఇలా వచ్చాను అలా వచ్చి గుద్దుకుంది. గుండెలో రూపం ప్రింటయిపోయింది.

వరం : అలాగా ...కంగ్రాట్సు ఇంతకీ మనకు తెల్సిన వాళ్ళేనా.

లోక : నువ్వూ చూసావురా ఇందాకా కార్డు పుచ్చుకు వచ్చిందే మూగ పిల్ల ఆ అమ్మాయి

వరం : ( అరిచాడు ) మావయ్యా....

లోక : ఏమిట్రా ఏమైంది ఏమిటా కేక ?

( రామాంజనేయులు ఆ కేకకి పరుగెట్టుకంటూ వచ్చాడు )

రామం : ఏవిట్రా వరం ఏవైంది ఆ కేకలేమిటి ?

లోక : తెలీదు కనుక్కోవాలి ఏరా నిన్నే ఎందుకలా ఓండ్రపెట్టావ్.

వరం : నా ఇష్టం అరుస్తాను. గర్జిస్తా గాండ్రిస్తా, ఓండ్రపెడతా మీకు చెప్పాలా .

( ఆవేశంగా బయటకు పోతున్నాడు. రామాంజనేయులు – ఆదుర్దాగా )

రామం : ఒరేయ్ వరం ఆ కోపం దేనికిరా ఎక్కడికి నిన్నేరా, చూస్తూ నిల్చుంటావేరా వాడ్ని

ఆపరా అఘాయిత్యం సన్నాసి ( లోకనాధం ఫాలో అవుతూ )

లోక : రేయ్ వరం ఆగరా అబ్బీ నేనూ వస్తున్నా

రామం : ఈ కాలం కుర్రాళ్ళని అర్థం చేసుకోవడం కష్టం. అర్థంలేని కోపతాపాలు –

అమ్మో అన్నం మాడిపోతున్నంట్టుంది. లోనికి పరిగెత్తాడు.

( దొంగరాముడు ఒంటరిగా వెతుక్కుంటున్నాడు. వెంకటప్పయ్య చిన్న సంచి

పుచ్చుకుని లోనికి వచ్చాడు . దొంగరాముడిని చూసి నమ్రతగా )

వెంక : బాబూ – నాపేరు వెంకటప్పయ్య . మీ ఇంట్లోకి ఓ మూగపిల్ల కార్డు పంచుకుంటూ

వచ్చింది అది నాకూతురు బాబూ.

దొంగ : నీ కూతురా ? సిగ్గులేదంట్రా. తలుపు చెక్కల్లే నువ్వుండి, వయసొచ్చిన ఆడపిల్లని ఇంటింటికీ త్రిప్పుతావా ? నువ్వేం తండ్రివిరా ....

(రామాంజనేయులు లోపలి నుంచి వచ్చాడు)

రామం : ఎవరదీ .

దొంగ : వుదయం వచ్చిన ఆ మూగపిల్ల తండ్రిట....తండ్రి....

వెంక : అనండి బాబూ అనండి. కాని తప్పు నాదికాదు బాబూ ...లక్షిది...

రామం: లక్ష్మీ అమ్మాయిపేరా ? అచ్చు మహాలక్ష్మిలా వుంది. ఆ కంగారు, మొహమాటం.... పెళ్ళి చేస్తావా ?

వెంక : పెళ్ళి అసలే ఆడపిల్ల – పైగా మూగది. నేనా పేదవాడ్ని. అలా గడప గడప తిరగవద్దమ్మా నే బిచ్చమెత్తయినా నిన్ను పోషించుకుంటానంటే ససేమిరా వప్పుకోదు. వెళ్ళి ఎంత సేపయింది బాబూ.

రామం : ఓ పావు గంటయి వుంటుంది. ఓ క్షణం కూర్చోండి ఇప్పుడేవస్తా...

( లోనికి వెళ్ళాడు, లోకనాథం ప్రవేశించాడు బయటనుంచి )

లోక : బావా ? బావా ? ఎవరు కావాలండి ?

వెంక : నా పేరు వెంకటప్పయ్య బాబూ.

దొంగ : ఇందాకొచ్చిన మూగమ్మాయికి తండ్రి

( ఆ మాట వినగానే లోకనాథం మొహంలో సంతోషం కనిపించింది )

లోక : పావుగంటకు పైనే అయింది. అన్నట్టు ఇదిగో కార్డు గూడా నాదగ్గరేవుంది – ఇలా ఇచ్చి అలా వెళ్ళిపోయింది ( కార్డు చూపించాడు )

రామం : ఎండలో పడి వచ్చారు. ఈ మజ్జిగ తీసుకోండి.

లోక : బావా, విన్నావా ? ఆ మూగ పిల్లకి ఈయన....

రామం : విన్నా విన్నా తేలిక కంగారు తొందర ఇంతకీ వాడేడి .

లోక : వరంగాడా – అలా ఇన్‌స్టిట్యూట్‌దాకా వెళ్ళివస్తానన్నాడు. అద్సరే గాని బావా ? నీతో ముఖ్యమైన సంగతి చెప్పాలి.

రామం : మనం తర్వాత మాట్లాడుకుందాం, కాస్తాగు ఇందాక మీ పిల్లని చూసాక నాకు దేవుడిపైన కోపం వచ్చిందంటే నమ్మండి,

లోక : కరెక్టు నాకూ అలాగే అనిపించింది. కనిపిస్తే కడిగి పారేద్దాం అన్నంత ఉద్రేకం వచ్చింది

రామం : ఒక్కమాట లేదని గాని పిల్ల బంగారం కదూ.... ఎవరైనా కళ్ళకద్దుకుని చేసుకుంటారు.

లోక : కళ్ళుమూసుకుని చేసుకుంటారు అవునూ డాక్టర్‌కి చూపించారా ?

వెంక : ఆపరేషన్ చేయిస్తే చాలా ఖర్చవుతుందన్నారు బాబూ. అందుకే కార్డ్సు వేయించి వూరూరా ఇల్లిల్లూ తిరుగుతోంది. తల్చుకుంటేనే నాకు కడుపు తరుక్కుపోతుంది ( ఏడుస్తున్నాడు )

లోక : బాధపడకండి – బావా – ఇందాక నువ్వు రాగానే అడిగావే ఏరా పొలం అమ్మకానికి పెట్టావా అని.

రామం : నువ్వుండ్రా సమయం సంధర్భం లేని మాటలు – చూడండి మీరు ధైర్యంగా వుండండి ఆ పిల్లకి దేవుడులాంటి మొగుడు వస్తాడని నాకనిపిస్తుంది.

లోక : నిజంబావా .....నిజం...తప్పకుండా వస్తాడు.

వెంక : అమ్మాయి ఈ పక్క వీధిలో ఎక్కడన్నా వుందేమో చూసొస్తా బాబు

లోక : మీరుండండి నేవెళ్ళి చూసొస్తా అది నా బాధ్యత

వెంక : ఎంత మంచివాళ్ళు బాబు మిమ్మల్ని చూస్తుంటే నాకు మాట రావడంలేదు. నేనే వెళ్ళొస్తా ఒకవేళ కార్డు గురించిగాని మళ్ళీ వస్తే వుండమనండి నే పది నిమిషాల్లో వచ్చేస్తా.

లోక : అలాగే ....త్వరగా వచ్చేయండి వంటలయిపోయినాయి. మీకోసం ఎదురు
చూస్తుంటాం

రామం : అవునవును మొహమాట పడకండి ఇది మీ ఇల్లే అనుకోండి
( వెంకటప్పయ్య వెళ్ళిపోయాడు )

లోక: బావా ఆయాన్ని చూస్తుంటే మా అన్న మావగారిలా లేడూ .

రామం : లేడు అచ్చుం మీ నాన్నలా వున్నారు. నీకు తెలవదు మీ నాన్నా సరిగ్గా ఇలానే
వుండేవారు.

లోక : అదే బావా నీతో వచ్చిన చిక్కు నేనేం చెప్పినా వప్పుకోవు - కాని బావా ఈ
విషయంలో మాత్రం నువు - తప్పదు అంతే....

రామం : సరే కానీ అలాగే - నాదేం వుంది అంతా ఘటన
( అంతలో ప్రసన్న వచ్చింది )

లోక : అదిగో లక్ష్మివచ్చింది...లక్ష్మీరా ...నీ గురించే అనుకుంటున్నాం

రామం : మీనాన్న కనిపించాడా ? నీ గురించి ఆయన వెళ్ళాడమ్మ ఇలారా.
( ప్రసన్న ముందు కంగారు, ఆందోళన, ఏంచెప్పాలో తెలీనట్లు పిచ్చి పిచ్చి
సంజ్ఞలు చేస్తోంది దొంగరాముడు ఆమె తంతుని గమనిస్తున్నాడు )

రామం : ఏమిటో అంటుంది. నీకేమో అర్ధం కావటంలా. ఈ మూగబాష తెల్సిన
వాళ్ళుంటే బావుండు

లోక :బావా నువ్వు తప్పుకో నే కనుకుంటాగా
మీ నాన్నగారు మీ గురించి వెళ్ళారు. నిన్ను కూర్చోమన్నారు. మళ్ళీ వస్తారు
( ప్రసన్న కంగారుగా వెళ్ళిపోబోయింది. లోక్‌నాథం చెయ్యి అడ్డం పెట్టి ఆపాడు )
ఏం భయం లేదు. ఆయన మా బావా. తండ్రిలాంటివాడు.

రామం :  రేయ్ అనవసరపు కూతలు కూయకు. ఆ పిల్ల అంటున్నది అది కాదులా వుంది... నువ్వు తప్పుకొ నే కనుక్కుంటా

( ప్రసన్నని రామాంజనేయులు తనవైపు లాక్కున్నాడు. ప్రసన్న వెళతానన్నట్లు సంజ్ఞలు చేస్తోంది )

లోక  : అది బావా వాళ్ళ నాన్న వచ్చి కేకలేస్తారని భయపడ్తోంది ....చూసావా ? ఎంత సంస్కారమో. ఈ రోజుల్లో ఇంత విధేయత.

రామం :  ఏం ఫర్లేదు నే చెప్తాగా అలా లోపల కూర్చో టి.విలో సినిమా వస్తోంది. పద...పద...

లోక  :  నువ్వెళ్ళి పన్చూసుకో బావా నే సినిమా చూపిస్తాగా.

( దొంగరాముడు అంతా గమనించి కోపంగా )

దొంగ : రేయ్ మీకు వేరే పన్లు లేవంట్రా. అమ్మాయ్ నువ్వెళ్ళు వూ.... అందుకే వెనకా ముందు చూసుకుని రావాలి అర్థవైందా

( ప్రసన్న అర్థమైంది అన్నట్లు తలూపి దొంగ రాముడికి నమస్కారం చేసి వెళ్ళబోతుండగా వెంకటప్పయ్య ఆమెకి ఎదురొచ్చాడు ఇద్దరూ ఒకరి వంక ఒకరు చూసుకొంటూ నిల్చుండిపోయారు )

లోక  : వచ్చారా – రండి ...మీ అమ్మాయి ! ఏమిటలా చూస్తున్నారు ?

రామం : నీకేవన్నా బుద్ధుందిరా. తండ్రికి కూతుర్ని పరిచయం చేస్తావా ? మీరలా వెళ్ళారు ఇలా వచ్చింది. మీరు కేకలేస్తారని తెగ భయపడి వెళ్ళిపోతానని ఒకటే సంజ్ఞలు

వెంక : నాకంతా అయోమయంగా వుంది. నాకేం అర్థం కావటంలా.

( ప్రసన్న వెంకటప్పయ్యకి నమస్కరించి )

రామం : అహహ... ఏం పితృభక్తి . మా వెధవా వున్నాడు దేనికీ .

లోక : తిండి దండగా  – నోరు లేకపోతే  ఏం బావా ?...

అపర గుణ  సుందరి  ఇంకా తత్సారం దేనికి  ? బావా ...నిన్నే

రామం : అవున్రా  ఇదిగో  వెంకటప్పయ్య  గారూ ఒకసారి  అలా లోపలికి వస్తారా, మీతో పర్సనల్‌గా వది నిమిషాలు మాట్లాడాలి.

( వెంకటప్పయ్య  ప్రసన్న వంక, మిగిలిన  వారి వంక  అయోమయంగా చూస్తున్నాడు  తర్వాత )

వెంక : నువు ఇక్కడే  వుండమ్మా ఆయనేదో  మాట్లాడాలట తర్వాత నేను నీతో మాట్లాడాలి. పదండి వెంకటప్పయ్య, రాంజనేయులు లోనికి వెళ్ళారు )

లోక   : ఆహా కాలం  కలిసోస్తే  పన్లు ఇలా చకచకా  అయిపోతాయన్న మాట.

( ప్రసన్నతో ) మా బావా లోపల  మన పెళ్ళి  – మన పెళ్ళి  గురించి మీ నాన్నగారితో  మాట్లాడుతున్నారు. నీకు ఇష్టమేనా ?

దొంగ :  చాలా కష్టం నిన్నెవడ్రా  చూస్తూ చూస్తూ కట్టుకునేది.

లోక : మూగవాళ్ళకు  మాట వినబడదు కాబట్టి  సేఫ్ – సార్ మీరలా పక్కదిలోకి....

దొంగ : సరసం వెలగబెడతావా ? రేయ్  స్నానం చేసేవురా.  నువ్వేమిటమ్మా  – చూస్తూ ఆ నిల్చొటం ? ఆ.....సిగ్గుపడి పారిపోక....

( ప్రసన్న వెంటనే సిగ్గు నటించి  బయటికి  జారుకుంది )

లోక   : ఆహా . సిగ్గు  పడుతుంటే సినిమా స్టార్‌లా వుంది.

అవునూ  పంపిచేసారేమిటి ? పాపం  ఆయన బాధపడతారె.

( దొంగరాముడు  సమాధానం ఇవ్వకుండా వెతక్కుంటున్నాడు ) దేవుడు  చల్లగా చూసి  తథాస్తు అంటే  ఓ పనయిపోతుంది. మూగ పిల్లని కట్టుకున్నందుకు సింపతీకి  సింపతీ ఫిజికల్ హేండీ క్యాప్‌డు కోటాలో  లక్ష్మికి  మంచి వుద్యోగం, అన్ని  ప్లస్ పాయింట్లే )

( దొంగరాముడుతో ) సార్ మూగవాళ్ళకు ఆపరేషన్ చేయిస్తే  మాటొస్తుందంటారా

దొంగ : మంచి పని చేస్తే మాట ఎందుకొస్తుందిరా...తప్పుకో...

లోక : ఏమిటో సార్..... మీకు నాకూ మధ్యన ఈ కమ్యూనికేషన్ గేప్ చాలా పెరిగిపోతోంది.నా వుద్దేశ్యం - వదిలేయండి . ఇంతకీ మీరు.....

( వరం హడావిడిగా ప్రవేశించాడు )

వరం : మావయ్య మావయ్య నా గురించెవరన్నా వచ్చారా ?

లోక : నీ గురించి నా గురించి ఎవర్రా వచ్చేది . అప్పులవాళ్ళు తప్ప ఎవరూ రాలా .

వరం : ఎవరూ రాలేదా ? మరేవైనట్లు

లోక : ఏమిటిరా - ఆ కంగారు ఏదైనా పిచ్చిపనిగానీ చేసావా ? ఆగరా - ఆ గదిలో వెళ్ళకు ....ముఖ్యమైన సమావేశం జరుగుతుంది.

వరం : లోపల ఎవరున్నారు. ? నాన్నేడి.

లోకం : లోపల మూగపిల్ల తండ్రి ? ఊ మూగపిల్ల ?

లోక : అదేరా వుదయం వచ్చిందే ఆ పిల్ల తండ్రితో ముఖ్యమైన సంగతి మాట్లాడుతున్నాడు ఓ క్షణం ఆగితే నీకో శభవార్త చెప్తా.

వరం : మూగ పిల్ల తండ్రి - సమావేశం - పైగా శుభవార్త - ఓరి దేవుడో నాకేమిటో అనుమానంగా వుంది.

( లోనికి పరిగెత్తబోగా, వెంకటప్పయ్య, రామాంజనేయులు అతనికి ఎదురొచ్చారు )

వెంక : మనుషుల్లో దేవుడులాంటి వారు వుంటారని విన్నాను గాని, మొదటిసారి చూశాను.

రామం : ఎంతమాట. ఎంతమాట. అంతా దైవరనిర్ణయం. ఇంతకీ అమ్మాయికేం అభ్యతరం వుండదుగా.

వెంక : నాపిల్ల బంగారం బాబూ - నామాట జవదాటదు.

వరం : నాన్నా ఏమిటి మీ మీటింగులు ? ఏవైంది ? నిన్నే

రామం : ఏవిట్రా ? ఏమిటి పిచ్చి కేకలు. ఏవైందని ఏం కాలా.

వరం : హమ్మయ్య . బతికించావ్. మావయ్య విన్నావా ? ఏం కాలేదట.

లోక : ఆ ఏం బావా ? ఏం కాలేదా .

రామ : ఒరేయ్ మీకెందుకురా చిన్నపిల్లలు నే చూసుకుంటాగా బయటికి పొండి.

వెంక : సరే ....నే వస్తానండి, తమర్ని మళ్ళీ కల్సుకుంటా.

రామం : అలాగే నే చెప్పిన సంగతులన్నీ మనసులో పెట్టుకోండి. అప్పుడే అందరికీ చెప్పకండి. నాకు ఇబ్బందులున్నాయి మీకు తెల్సుగా ?

వెంక : చిత్తం వస్తానండి వస్తాబాబూ బాగా చదువుకుని నాన్నాగారికి పేరు తెచ్చి పెట్టాలి వస్తా ( వెళ్ళి పోయాడు )

లోక : బావా, ఇబ్బందులంటున్నావ్, అన్నీ వివరాలు స్పష్టంగా చెప్పావా .

రామం : చెప్పారా, కాదంటాడేమో అని కించిత్తు సందేహించా గాని, సంతోషంగా వప్పుకుని పైగా కాళ్ళపైన పడ్డాడు తాంబూలాలు పుచ్చుకునేదాక ఎవరికి చెప్పొద్దని అనుకున్నాం.

వరం : తాంబూలాలు పుచ్చుకోవటం ఏవిటి ? ఎవరికి పెళ్ళి ? నాన్నా నిన్నే

రామం : నీక్కాదు సరేనా ! అన్నీ నీకే కావాలి.

( లోనికి వెళ్ళబోగా, లోకనాథం బావగారి కాళ్ళపైబడి ప్రేమగా )

లోక : బావా ? నిజంగా నువ్వు దేవుడికి. నీకింత పెద్ద మనసుందని ఇన్నాళ్ళు తెల్సుకోలేక పోయాను. నన్ను క్షమించు

రామం : ఛ దాందేముంది రా ఓ మూగ జీవికి సహాయం చేసే అదృష్టం ఆ పరమాత్ముడు కలిగించాడు. ఇదంతా చేస్తున్నది నా గురించా !

లోక : కాదు – నాకు తెల్సు .....బావా అర్జంటుగా నాకు నీ కలర్ ఫోటో ఒకటికావాలి. దేవుడిమందిరంలో పెట్టుకుంట.

రామ : నీకేం వచ్చినా పట్టదే... లైం ఎంతయిందో ఏమో

( లోనకి వెళ్ళబోగా వరం జుట్టు పీక్కుంటూ )

వరం : ఓరిదేవుడో నాకు ఒక్క ముక్క కూడా అర్ధం కావటంలా – అసలింతకి ఎవరికి ఎవరితో పెళ్ళి ?

లోక : ఏమిట్రా ? దేనికా కంగారు. ఈ వయసులో మీ నాన్న మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నాడేమో అని డౌటా. పిచ్చి వెధవ, పెళ్ళి నాకురా, ఆ మూగ పిల్లతో

వరం : ఆ, ఇంపాజిబుల్

## లైట్స్ ఆఫ్ – అండ్ ఆన్

( దొంగరాముడు యధావిధిగా వెతుక్కుంటున్నాడు. రామాంజనేయులు ప్రేక్షకులు వైపున కనిపించని భార్యా ఫోటోతో మీటింగులో వున్నాడు )

రామం : సీతా ? సీతా నే మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నానని అపార్ధం చేసుకొని శపిస్తావా . లేదు. నాకు తెల్సు నువ్వు అర్ధం చేసుకోగలవ్. ఓ పేద ఇంటిపిల్ల. పైగా మూగది దేవుడు ఆ పిల్లకి చేసిన అన్యాయాన్ని మనషిగా కొంతవరకైనా సరిదిద్దుదావన్న ఆలోచన తప్ప వేరే ఆశలుండి కాదు. రేపు వరం గాడికి పెళ్ళయితే కోడలకి హారతి ఇచ్చే ఆడదిక్కు గూడా లేదని ఎంత కుళ్ళిపోతున్నానో, నీకేం తెల్సు ? నన్నర్ధం చేసుకో సీతా ? అర్ధం చేసుకో !

( దొంగరాముడు అంతా విన్నాడు ...ముక్కున వేలుగూడా వేసుకున్నాడు....లోకనాధం లోపలినుండి హడావిడిగా వస్తూ )

లోక : ఏరా, ఎక్కడ్రా. అంట్ల వెధవ , అడ్డగాడిద, నిన్నేరా.

దొంగ : రేయ్ నిన్నేరా పిలుస్తున్నాడు.

రామం : ఆ , ఏరా వళ్ళు కొవ్వెక్కిందా ? అంతంత మాటలంటావురా ? నా తిండి తింటూ నన్నే ఒరే గిరే అంటావా .

లోక : బావా బావా ఆగాగు. ఆ టైటిల్స్ నీక్కాదు. వరం గాడిని, నిన్ను చూస్తూ చూస్తూ అంతం మాటలనగలనా అక్క మొగుడివి. పైగా నాబతుక్కి ఓ దారి చూపిస్తున్న దేవుడివి.

దొంగ : ఇక చాల్లేరా...తప్పుకో....

లోక : బావా , వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. ఎవరితను స్నేహితుడా ? అతిథా .

దొంగ : ఎవర్నా ? పెళ్ళి వారి తాలూకా....

లోక : అమ్మో అలాగా ! నమస్కారం సార్ ! పెళ్ళంటే గుర్తొచ్చింది. బావా వెళ్ళి కళ్యాణ మండపం బుక్ చేసుకొస్తాను. మరి ముహూర్తాలు గురించి వాకబు చేస్తావా ?

రామం : అయినా కళ్యాణ మండపాలు అవిదేనికిరా ? ఏదో గుళ్ళో అయ్యిందనిపిస్తే పోలా .

లోక : అలా అనకు. మన సర్కిల్ పెద్దది. పెద్ద పెద్ద వాళ్ళు వస్తారు. ఈవిషయంలో నామాట విను మిగతా విషయాల్లో నీ మాట వింటాగా !

రామం : సర్లేరా ! నీ ముచ్చట నేనెందుకు కాదనాలి త్వరగారా !

లోక : అలాగే వస్తా !

రామం : పిచ్చి వెధవ ...నేనా మూగపిల్లని చేసుకుంటానంటే వీడెందుకిలా హడావిడి చేస్తున్నాడు ? పైగా కళ్యాణ మండపం మాట్లాడి వస్తాట్ట ....అంతా వాళ్ళక్కయ్య పోలిక.... ఏం వచ్చినా కష్టమే ఒరేయ్ ! రాముడూ ! రాముడూ !

దొంగ : నే ! ఇక్కడ ఉన్నా ....విషయం చెప్పు....

రామం : నేను సిద్ధాంతిగారింటి దాకా వెళ్ళొస్తాను....ఇల్లు చూస్తుంటావా .

దొంగ : ఇల్లు చూస్తూ కూర్చోవటానికి నేను నీ ఇంటి, నౌకర్నా ? దొంగరాముడ్నిరా ! దొంగ రాముడ్ని.... బయట తాళం వేసుకుని వెళ్ళు . నే లోపల వెతికేసుకుంటా !

రామం : మావాడు వస్తాడ్రా ...తాళం వేసుంటే వీధులు పట్టుకు తిరుగుతాడ్రా ఆకలికి ఆగలేడు... బాబు ఈ ఒక్కసారికి కాదనకు....నాకు తెల్సు నువ్వు కాదనవు...

దొంగ : మీలాంటి వాళ్ళతో వచ్చినచిక్కే ఇది సరే....

రామం : మావాడొస్తే కూర్చోపెట్టి వెళ్ళు ......ఉంటా....ఇల్లు జాగ్రత్త ...

( రామాంజనేయులు వెళ్ళేడు )

దొంగ : నాపేరే దొంగరాముడు ...ఇల్లు జాగ్రత్తట ఇల్లు జాగ్రత్తట !

( వరప్రసాదం కంగారుగా ప్రవేశించేడు )

వరం : ఇదిగో నీ పేరేంటో....మా నాన్న అంత అర్జంటుగా పరిగెడుతున్నాడు ... ఎక్కడికి ?

దొంగ : పంతులు గారింటికి ...చూడు నేను అర్జెంటుగా మందు తెచ్చుకోవాలి. ఎక్కడికీ పోకు.... ఇల్లు జాగ్రత్త ఛీ...పాడు మాటలు... ( అంటూ బయటకు వెళ్ళాడు )

వరం : నాన్న ఇంట్లో లేడు. మావయ్య ఇప్పట్లోరాడు. దొంగరాముడు కూడా లేడు. బంగారం లాంటి ఛాన్సు ...ఇప్పుడు గానీ ప్రసన్నొస్తే మనసు విప్పి బోల్డు మాట్లాడుకోవచ్చు....వెధవ కొంపలో ఫోను కూడా లేదు. వుంటేనా ఇలా డయల్ చేసి .... హలో ప్రసన్నా ...నేనోయ్ నీ వరాన్ని ...ఇంట్లో ఎవరూ లేరు ఎలోన్ వచ్చేస్తావా ?

( ప్రసన్న నిజంగానే వచ్చింది ) ( వరం ఆశ్చర్యపోయాడు )

అదే ! ...అప్పుడే వచ్చేసావా ; ఇప్పుడేగా ఫోను చేసింది.

ప్రసన్న : వాయు పుత్రుడొచ్చి వాకిట్లో డ్రాప్ చేసి పోయాడు..

వరం : ఏవిటి ? కోపమా ?

ప్రసన్న : అబ్బే ఆనందం పరమానంతం ... బ్రహ్మానందం.

వరం : అలా కుర్చో ఏం తీసుకుంటావ్....కాఫీ, టీ, డ్రింక్స్ అదే కూల్ డ్రింక్స్ ...అన్నట్లు నీకో గుడ్ న్యూస్ .... మా మావయ్యకి పెళ్ళి ఫిక్సయ్యింది ఓ మూగ పిల్లతో....

ప్రసన్న : కొంపదీసి  నేను కాదుకదా...

వరం :  జోకు  వెయ్యకు నాకు కోపం  వస్తుంది.  మొన్న ఆ పిల్ల తండ్రి వచ్చాడు. మాట్లాడుకోవటానికి. మాట్లాడడం కూడా అయిపోయింది.

ప్రసన్న : నీకన్నా మీ మావయ్య నయం...  నీకు నా మీద  ప్రేమ ఎటూలేదు.. కనీసం జాలి కూడా లేదు. అదే బాధ...

వరం : నీమీద నాకు ప్రేమలేదా ? పగలు రాత్రి  నీగురించే  ఆలోచన్లు ...నువ్వు లేకపోతే బతకను. నీకోసం  ప్రాణాలైనా  ఇస్తాను....!

ప్రసన్న : అంత ఘాటు ప్రేమన్నమాట...

వరం : కావాలంటే  ఈ మాట గుళ్ళో దీపం ఆర్పి  మరీ చెప్తాను తెల్సా .

ప్రసన్న :  దీపం  గుళ్ళో  ఆర్పుతావో ...నా జీవితంలో ఆర్పుతావో  తెలీకుండా  ఉంది.

వరం  : అంత భయం  దేనికీ  ప్రసన్న .....నేలేనూ...

ప్రసన్న : వున్నావ్ ఏ లాభం  ....మీ నాన్నని  చూస్తే  భయం ...మన సంగతి చెప్పలేవు. ఇలా ఎంతకాలం ! ఆడపిల్ల  అవస్థలు నీకేం తెలుస్తాయ్ ?

వరం : చెప్తేగా  తెలిసేది.

ప్రసన్న : అయితే విను. మా నాన్న నాకో సంబంధం  తెచ్చాడు. బ్యాంకులో  ఆఫీసరు. మంచి  ఫ్యామ్లీ, కుర్రాడు  నీకన్నా నీట్‌గా వుంటాడు.

వరం : వాడి మొహం !

ప్రసన్న : మొహం కూడా బాగానే వుంటుంది.. నొక్కుల క్రాపు చక్కటి ముక్కు....

వరం : ఎత్తుపళ్ళు, మచ్చల మొహం లైటుగా నత్తి...

ప్రసన్న : ఇంట్లో అందరికీ నచ్చాడు. మా నాన్నడిగితే ఏం చెప్పను ?

వరం :  నచ్చలేదని  చెప్పేయ్యి .....వరప్రసాదాన్ని తప్ప మరొకర్ని  భర్తగా  వూహించలేనని ధైర్యంగా చెప్పు ఏం ఫర్వాలేదు.

ప్రసన్న : సరే చెప్పానే అనుకో....నువ్వు రెడీనా ?

వరం : రెడీనా అంటే రెడీనే...కానీ మా నాన్నతో ఓ మాట చెప్పి....

ప్రసన్న : ఎపుడు చెప్తావ్...ఇవాళా ? రేపా ? మర్నాడా ?

వరం : ప్రసన్న ...అసలు ప్రాబ్లమ్ ఏవిటంటే మానాన్నకి కులాల పట్టింపెక్కువ.... అందుకని...

ప్రసన్న : ఓహో ! అదా నీ పిరికితనానికి కారణం. ఇప్పటికయినా చెప్పేవ్. ప్రేమించడానికి అడ్డురాని కులాలు పెళ్ళనేసర్కి అడ్డు గోడలౌతాయి. అంతేగా నే వెడ్తున్నా !

వరం : ఏవిటీ ! అప్పుడే వెడతావా ? కాస్సేపు వుండు...

ప్రసన్న : చూడువరం నేను ఆడపిల్లని, పరువుగల కుటుంబంనుంచి వచ్చినదాన్ని ...ఇళ్ళు పట్టుకుని తిరగాల్సిన ఖర్మ నాకేం పట్టలేదు.

వరం : ప్రసన్న ....ప్రసన్న నామాట విను...

ప్రసన్న : నువ్వు నా మాట విను.... నన్ను ప్రేమించేవుగానీ అర్ధం చేసుకోలేదు. మన సంగతి మీ నాన్నకి చెప్పిఒప్పిస్తే సరేసరి...

వరం : లేకపోతే...

ప్రసన్న : ప్రసన్న నీకు కనిపించదు. అప్పుడు ప్రాణాలే ధారపోస్తావవో మీ కులం పిల్లని పెళ్ళి చేసుకుంటావో చూస్తా...

వరం : ముమ్మాటికీ నువ్వంటే నాకు ప్రాణం నన్ను నమ్ము.....

ప్రసన్న : ప్రేమంటే పార్కుల్లో తిరగటం, చీకటి మాటున సినిమాహాల్లో చేతులెయ్యడం కాదు. అలాంటి పన్లు టేమ్ డిక్...అండ్ హీరీ ఎవడైనా చేస్తాడు...కాని నిజంగా ప్రేమించిన వాడికి ధైర్యం కావాలి... పోరాడి ప్రేమను సొంతం చేసుకోవాలి. ఆ ఖలేజా నీకుందో లేదో ఆత్మ విమర్శ చేసుకో వస్తా...సారీ వెడుతున్నా....

వరం : ప్రసన్న .ఆగు నీకోసం .....మానాన్నని కాదు ఈ ప్రపంచాన్నే ఎదిరస్తా ? తెల్సా ?

ప్రసన్న : సరే....ఆ మాట మీ నాన్నతో చెప్తు వస్తున్నాడుగా ఎలా చెపుతావో వింటాను...!

( వరం కంగారుగా బయిటికి చూసి )

వరం : అమ్మో నిజంగానే వస్తున్నాడు... ఎలా ? ఓ పన్జెయ్యి ...అలా దాక్కోవా ప్లీజ్ ?

ప్రసన్న : నేను దాక్కోవాలా? తప్పు చేసిన వాళ్ళు దాక్కోవాలి. మొహం చాటు చేసుకొని....

వరం : నన్ను అందరిముందు పరువు తియ్యటమ్ నీ ధ్యేయం అయితే సరే ఓకే...

ప్రసన్న : సరే....లోపల వుంటాను మీ నాన్నతో ఎలా మాట్లాడుతావో సీన్ ఎలా మేనేజ్ చేస్తావో చూస్తాను....

( ప్రసన్న లోపలిగదిలోకి వెళ్ళింది. రామాంజనేయులు నీరసంగా వచ్చేడు....ప్రేమగా )

రామ : ఏరా ఇల్లు గుర్తొచ్చిందా ? ఆ చమటలేమిటి ? బస్కీలు తీస్తున్నావా ?

వరం : నా బతుక్కి మిగిలిన ఏకైక కార్యక్రమం అంతేగా ?

రామా : అంత కోపం దేనికిరా ? పాలు తాగేవా .

వరం : నాన్న ! పాలు తాగి తోక వూపుకుంటూ తిరగడానికి నేనెవర్ని ? మనిషినా ? జంతువునా ? ( లోకనాథం వచ్చేడు )

లోక : సారీ...మీరు ఫ్యామిలీ ఎఫైర్సు మాట్లాడుకుంటున్నట్లుంది.

రామ : నువ్వాగరా ! ఇప్పుడు ఏమైందని అంత రోషం ? కోపం ?

వరం : ( ప్రసన్న వున్న గదివైపు చూసి ) నాన్నా నీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి అలా కూర్చో!

లోక : బావా ! ఇలారా ....వాడి వాలకం చూస్తుంటే ...నాన్నా నేనో అమ్మాయిని ప్రేమించానని పెళ్ళి చేస్తావా ? చస్తావా ? అనేటున్నాడు.

రామా : అంత మగాడయ్యాడా ? నీకు చెప్పేడా ?

లోక : చెప్పేడు కాబట్టే ముందుగా నీకు చెప్తున్నాం .....నువ్వు గట్టిగా వుండకపోతే ....ఎదర శుభకార్యం ఏం కాను ....? ఆలోచించు...

రామ : నిజమేరా ? ఏం చెయ్యను ?

లోక : జాతకం చూపించేను వాడికి పాతికేళ్లు రాకుండా పెళ్ళిచేస్తే నీకు ప్రాణగండం వుందని ఓ మాట ముందు అనెయ్యి ...ఆనక చూసుకుందాం....

వరం : నాన్నా ! ఏంటా గుసగుసలు ...నాన్న ...చెప్తున్నా విను....నేనో అమ్మాయిని ప్రేమించాను ... అమ్మాయి పేరు ప్రసన్న....

రామా : వోరి భడవా ?

లోక : నేను చెప్పలేదూ .

వరం : భడవా లేదు, కడపవలేదు...ఆ పిల్లతో నాకు పెళ్ళి చేస్తావా ? చచ్చిపొమ్మంటావా .

రామా : అవేం మాటల్రా ? తప్పు కదా ? నాన్నతో అలాగేనా మాట్లాడేది ? ఎవర్రా ఆపిల్ల ?

వరం : ఓ ఆడపిల్ల...అందాల బొమ్మ...బుద్ధిమంతురాలు ....నాకోసం ప్రాణం చులగ్గా ఇచ్చేస్తుంది....

లోక : మన కులం వాళ్ళపిల్లేనా ? అడుగు బావా ?

వరం : మావయ్య ...నువ్వు రాజకీయం చెయ్యకు....నాన్న ...నేను పెళ్ళిచేసుకుని సుఖంగా వుండడం నువ్వు చూళ్ళేవా ?

లోక : చూడలేడ్రా...అదే ప్రాబ్లమ్ ?

వరం : ఎందుకని ? నాన్న...నిన్నే....

లోక : బావా ? చెప్పేయ్యి మీ....

రామా : నాకు దడగా వుందిరా ...నువ్వే చెప్పు....

లోక : చూసేవురా ! దేవుడిలాంటి తండ్రిని ఏడిపిస్తావురా ? అటు చూడరా ! నిప్పులాంటి నిజాన్ని గుండెల్లో దాచుకొని నీకు చెప్పలేక, అలాగని తను మింగలేక ఎలా నలిగిపోతున్నాడో చూడరా ? నీకు పాతికేళ్ళు రాకుండా పెళ్ళి చేస్తే మీ నాన్నకి ప్రాణగండం వుందని జాతకంలో రాసుందిరా ?

వర : నాన్న ...నిజమా .

రామా : అవున్రా ...ఈ నిజం తెలిస్తే నువ్వు బావురుమంటావని కూడా తెల్సురా వరం ....!

( విషాద పాట భోరున వినిపించింది )

వరం : అపండి....ఇదంతా నాటకం ....నేను నమ్మను ....జాతకాలు ట్రాష్, నాన్‌సెన్సు....

లోక : అయ్యిందా ! చూడరా అబ్బీ... నువ్వెంత గింజుకున్నా సుఖం లేదు. ఈ ఇంట్లో ఓ శుభకార్యం జరగబోతోంది. .... ఆ తర్వాత నీ పెళ్ళి గురించి విచారణ జరుగుతుంది బావా ....కళ్యాణ మండపం ఓకే... మరి ముహూర్తం గురించి...

రామ : సిద్ధాంతిగారికి నా జాతకం ఇచ్చొచ్చేరా....చూసి చెప్తానన్నాడు

( లోపలికి వెళ్ళబోయాడు )

లోక : నా పెళ్ళి ముహూర్తానికి ఆయన జాతకం ఇచ్చేనంటావేవిటి ? తప్పు వినుంటా ?

( వరం గుమ్మానికి అడ్డంగా నిల్చున్నాడు )

వరం : నాన్న...నువ్వు లోపలికి వెళ్ళటానికి వీల్లేదు...అంతే !

రామా : ఎందుకని లోపల ఎవరున్నారు....

లోక : లోపల ఎవరోవున్నారని కాదు బావా ? వాడి సంగతి తేల్చమని ధర్నా చేస్తున్నాడు. అంతే !

వరం : అవును ....కావాలంటే ఆ గదిలోకి వెళ్ళు....

రామా : చూస్తున్న కొద్దీ మొండితనం ఎక్కువౌతోంది. నాయనా, బాబూ అంటే పేట్రేగిపోతున్నావ్. నాగ్గాని తిక్కరేగిందంటే మెడ పట్టుకొని బయటకు గెంటుతా అడుక్కుతిందువుగాని...తప్పుకో,....

వరం : తప్పుకోను...ఆ గదిలో  నీకేంపని బలవంతంగా  లోపలికి వెళ్ళేవా బావిలోకి
దూకిఛస్తా ! అంతే !

రామం : అంతమాట అంటావురా  ? నీ మీద  ఆశలు పెంచుకుని  బతుకుతున్న
నాన్నతో ఇలానేనా  మాట్లాడేదీ ? నువ్వెందుకు  చావటం ? నేనే పోతారా నీకు
నాన్నలేడు ( ఆవేశంగా వెళ్ళాడు )

లోక : దేనికైనా సమయం  సంధర్భం  వుండొద్దూ, పిల్ల వెధవ్వి  ఇంత పంతామా ?
( లోపలి నుంచి చచ్చేన్రా  అని రామాంజనేయుల కేకల వినిపించింది )
కొంపముంచేవు కదరా !  ముసలోడు  అట్లకాడతో  పొడుచుకున్నట్టున్నాడు....
( పరుగెట్టాడు ప్రసన్న బయటి కొచ్చింది )

ప్రసన్న : ఏమైంది  ? ఎవరికేకపెట్టింది ?

వరం  : మానాన్న .....ఆత్మాహత్యాప్రయత్నంలావుంది... ప్రస్తుతానికి నువ్వెళ్ళు ....
పొజిషన్ అర్థం  చేసుకో....

ప్రసన్న : సరే ....వెళ్ళు వెళ్ళు  అంటే పట్టుకొని వేళ్ళాడే  రకం కాదు. నే వెళుతున్నా...
నన్ను మర్చిపో ?

వరం  : ప్రసన్న.....ప్రసన్న ప్లీజ్ నన్నర్థం చేసుకో ?
( లోకనాథం  రామాంజనేయుల్ని నడిపించుకుంటూ  వచ్చేడు )

లోక  : మెల్లగా, కాలు విరిగిందా ?  అయినా  వెనకముందు చూసుకోవద్దూ ....
కాలు విరిగిందా ?

రామా : ఏమో తెలీదు....కాలు కింద పెట్టనీయ్యి...నాయనా వరం ....నా చిట్టి తండ్రీ
...ఇలారా ....నాన్నని  కష్టపెట్టకురా !

లోక  : ఇప్పటికయినా  చెప్పరా....ఆ గదిలో ఎవరున్నారో....

వరం  : ఎవరూ లేరు....వుత్తినే అలా అన్నాను...కావాలంటే  వెళ్ళిచూడు...
( లోపలికి పోయాడు )

లోక : బావా ...ఈ వెధవకి  పిచ్చి పట్టలేదు కదా.... ?

రామా : అదే భయంగా వుందిరా .... ఇంకా వాడికి  ఆ సంగతి  చెప్పలేదు....విని ఏమంటాడో .... ఏం  గొడవ చేస్తాడోనని భయంగా వుందిరా....

లోక  : నీకింత భయం పనికిరాదు బావా ! అయినా వాడికి ఈ పెళ్ళికి  సంబంధం ఏవిటి ? పైగా సంతోషిస్తాడు....

రామా : అంతేనంటావా ? అయితే వీలు చూసుకొని నే చెప్తాలే !

లోక  : నీకెందుకు నువ్వురూకో  నే చెప్తాలే...

రామా : కాదులే నే చెప్తేనే మర్యాదగా వుంటుంది.

లోక  : అలా కాదులే  నే చెప్పుకుంటాలే !

రామా : నేనే చెప్పుకుంటాను. ఇంక నోరెత్తకు....

( దొంగరాముడు  వచ్చేడు వాళ్ళ పోట్లాట్ట విన్నాడు )

దొంగ : అరేయ్ మీకేం పనులు  లేవట్రా అలా వూరకుక్కల్లా  మొరుగుతున్నారు.

లోక  : బావా  అసలెవరితను ? ఛ ! ఎంతమాటవస్తే అంత మాట అనేస్తుంటాడు.

రామా : నే చెప్తాగాని కాస్త  ఆచెయ్యి  ఇలా ఇవ్వు....

లోక  : ఇవ్వను...చెయ్యికాదు కదా వేలు కూడా ఇవ్వను...అసలెవరీయన ?

దొంగ : చెప్తారా !  కులాలు మతాలు, ప్రాంతాలు బాధల్లేని వాడ్ని....నీ ఇల్లు నా ఇల్లు, నీ సొమ్ము  నా సొమ్ము అని తేడాలు లేనివాడ్ని . ప్రపంచం అంతా నాదే అని నమ్మేవాడ్ని !

లోక  : ( భక్తిగా నమస్కరిస్తూ ) క్షమించండి...మిమ్మల్ని  గుర్తించలేకపోయేను. ప్రపంచ మానవ హక్కుల అధ్యక్షులు కదూ మీరు !

రామా : నీ బొంద  వాడి పేరు  దొంగరాముడు...అదేదో పోయిందట . వెతుక్కుంటుంటాడు...

లోక  : మీరు  దొంగరాముడా  ? దొంగతనానికి  కొత్త భాష్యం చెప్పిన గొప్పవారు

దొంగ : అవున్రా ...తెల్సిందిగా...తప్పుకో !

లోక : వెతుక్కోండి సార్ .హాయిగా తృప్తిగా వెతుక్కోండి...

రామా : ( లేవబోయి ) అబ్బా...

లోక : ఏం బావా ! కాలు విరిగిందా ?

రామా : అపశకునం కూతలు నువ్వునూ...విరగలా ...బెణికింది... ఒరేయ్...అన్నట్లు ఆ విషయం నువ్వు చెప్పకు....నే చెప్పుకుంటా ( లోపలికి వెళ్ళాడు )

లోక : నాపెళ్ళి సంగతి ఆయన చెప్పుకుంటానంటాడేవిటి ? మొదటిసారి ఆంటే గ్రామరు తప్పనుకున్నాను. అదేమాట పదే పదే వాడుతుంటే అంటే కొంపదీసి ?

దొంగ : ముసలోడు – నీ కొంప ఎప్పుడో తీసేసాడ్రా ...ఆడు చెప్పేది ఆడి పెళ్ళి గురించి ...ఆ మూగమ్మాయిని కట్టుకునేది వాడే...నువ్వుకాదు.తెల్సిందా ? ఇక తప్పుకోరా ?

లోక : ఆ నిజంగానా ...అలా జరగడానికి వీల్లేదు. బావా ? బావా ? లోపలికి వెళ్ళాడు. ( లోపల గదిలోంచి శబ్దాలు విన్పిస్తున్నాయి . దొంగరాముడు హాల్లోకి వచ్చేడు. వరం కూడా కంగారుగా వచ్చాడు. చిరిగిన చొక్కాతో ఏడుస్తూ బయటికొచ్చేడు. లోకనాథం )

వరం : మావయ్య ...మావయ్య ఏవిటీ అవతారం ,...ఏమైంది ?

లోక : ఎవరు బాబూ నువ్వు....నీకు పెళ్ళయిందా ?

వరం : మావయ్యా నేను వరాన్ని ....అలా కుర్చో.... నీళ్ళు కావాలా ?

లోక : నాకెందుకు బాబూ ...నాకు కన్నీళ్ళున్నాయిగా

వరం : నాన్న ...నాన్నా త్వరగారా....మావయ్యకి ఏదో అయింది. పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నాడు. ( రామాంజనేయులు వస్తూనే )

రామం : ఒల్లుకొవ్వెక్కితే అలానే మాట్లాడుతాడు. వుచ్చం నీచం లేకుండా వరసవాయి చూడకుండా వాగుతాడా రెండు తగల నిచ్చా వెధవకి.

దొంగ : మంచి పన్చేసావ్ బయటకు గెంటేయ్... ఓ పనైపోతుంది.

రామా : ఏదోలే బామ్మర్ధి కదాని ఇంట్లో కూర్చోబెట్టి తిండి పెడ్తుంటే,
నాకే ఎసరు పెడ్తాడా .

వరం : ఏం చేసేడు నాన్న ...!

రామా : రేపు నీకు పెళ్ళయి కోడలు గడపలో కాలు పెడ్తే హారతిచ్చే ఆడ దిక్కులేదని కుళ్ళిపోతుంటే దేవుడిలా ఆ వెంకటప్పయ్య రావడం, అడగంగానే సరే అనటం అంతా నా అదృష్టం అని నేను తెగ పొంగిపోతుంటే ...వీడొచ్చి ఆ మూగపిల్లని నేను చేసుకుంటానంటాడు...కొట్టాలా ? నరకాలా ?

దొంగ : రెండోది బెటర్

వరం : నాన్న అంటే నువ్వు ఆ మూగమ్మాయిని ...

లోక : పెళ్ళిరా ...పెళ్ళి మనమంతా పెళ్ళివారం...
కోతిబావకు పెళ్ళంటా కోవెలె తోట విడిదంటా...

వరం : నాన్న ...ఈ వయస్సులో నీకు పెళ్ళీ పైగా ఆ మూగమ్మాయితో ....

రామ : అరవై ఏళ్ళు ఓ వయస్సా ? చిన్నవెధవ ఇవన్నీ నీకెందుకురా...చక్కగా సినిమా చూసిరా ఫో ( డబ్బులిచ్చి లోపలికి వెళ్ళాడు )

వరం : మావయ్య చంటి పిల్లాడిలా ఆ ఏడుపేంటి రా...సినిమాకి పోదాం ... మా నాన్న డబ్బులు కూడా ఇచ్చాడు...

లోక : నువ్వెళ్ళు నేను రాలేను ( పాట అందుకున్నాడు )
( వరం వెళ్ళేడు ...వెంకటప్పయ్య వచ్చేడు )

వెంక : బాబూ ! రామాంజనేయులుగారున్నారా ? వార్నోసారి పిలుస్తారా ?
( లోకనాథం ఘొల్లుమన్నాడు ) దేనికి బాబూ, ఏమైంది ? అందరూ క్షేమమేనా ? అమ్మాయికి ట్రీట్‌మెంట్ చేయిస్తానంటే తీసుకొచ్చేను. రామంజనేయులు గారూ...రామాంజనేయులు గారూ ....?

రమా : మీరా మావయ్యగారూ ? ఇందాకట్నుంచి అదే అనుకుంటున్నాను. రాలేదేవిటి చెప్మా అని ఇంతకీ లక్ష్మి ?

వెంక : వచ్చింది బాబూ. గడపలో వుంది మిమ్మల్ని అడిగి...

రామా : అదే తప్పు సరే అనుకున్నాక మీ ఇల్లు నా ఇల్లు ఏవిటండీ... పిలవండి ...!

వెంక : అమ్మా.... లక్ష్మీ ...లోపలికి రామ్మా. నిన్నే !

(లక్ష్మి వచ్చింది.... ఆమెను చూడంగానే ఘోల్లుమన్నాడు లోకనాధం )

వీళ్ళేనమ్మా నేను చెప్పేనే రామాంజనేయులుగారని ( లక్ష్మీ నమస్కరించింది )

రామ : కళ్యాణ ప్రాప్తిరస్తూ....దీర్ఘ సుమంగళీ భవ !

వెంక : ఈ కుర్రాడు ఈయనగారి బావమర్ధి నీకు అన్నయ్య వరస ( లోకనాధం మళ్ళీ ఏడ్చేడు ) దేనికా కుర్రాడు పాపం అంతలా ఏడుస్తున్నాడు....

రామ : తిన్నది అరక్క నువ్వు లోపలికి పదమ్మా ....ఇకనుంచీ ఈ ఇల్లు నీదే... ఈ గది వాడుకో స్నానం కానిస్తే వంటయ్యింది... భోజనాలు చెయ్యొచ్చు....

( వెంకటప్పయ్య లక్ష్మీని తీసుకొని లోపలికివెళ్ళాడు ) నట్టింట ఆ వెధవ ఏడుపులేంటి ఎవరో పోయినట్లు.... అలా వెళ్ళి సత్రం అరుగులమీద కూర్చొని కాసేపు ఏడ్చిరా..... ఫో...( వెళ్ళి పోయాడు )

దొంగ : తప్పుకోరా ....ఆ ఏడుపేంట్రా ...ఆడముండలాగా ! తప్పుకో....

( లోకనాతం ఏడుపు ఆపేడు. లక్ష్మి ఇల్లు వూడ్చే పన్లో వుంది.... దొంగరాముడు, లోపలవున్న ఆమెనే తధేకంగా చూసి ఆశ్చర్యంలో వున్నాడు...)

మూగపిల్లకి పెత్తనం అప్పుడే వచ్చేసింది ( అంతలో బయటనుంచీ వరం వచ్చేడు...)

వరం : మావయ్య ...నా మాట విను.... ఆ పిల్లను చూసి ముచ్చటపడ్డావ్ ...కుదలరలేదు... దానికి ఇలా ఏడుస్తావా. ఈ మూగ పిల్ల కాకపోతే మరో చెవిటిది. ఇంకో కుంటిది. కాకుంటే గుడ్డిది. నీకు పిల్లే దొరక్క పోతుందా ? ఓ ఆడదాని గురించి ఇలా ఏడవడం మగాడి లక్షణం కాదు. పద.... అలా కాసేపు బయట తిరిగొస్తే మనసు కుదుట పడ్తుంది.

లోక : అది కాదురా ... ఆ పిల్లా...

వరం : ఆపిల్లా లేదు... ఈ పిల్లా లేదు...నీ గురించే వెళ్ళి వెనక్కి వచ్చేను...
ఎంతయినా మావయ్యవి కదా ? చూస్తూ వూర్కోలేను.
( లక్ష్మి ఇంట్లోంచి వచ్చింది. వెంకటప్పయ్య కూడా వచ్చాడు వరం గమనించలేదు )

వెంక : బాబూ ! నా పేరు వెంటకప్పయ్య లక్ష్మికి తండ్రిని. నువ్వు రామాంజనేయులుగారి అబ్బాయివి కదూ ? అమ్మాయి....ఇతగాడు వరప్రసాదం అని... నా కూతురు లక్ష్మి... ( అంటూ పరిచయం చేసాడు... వరం, లక్ష్మిని చూసి షాకయ్యాడు. వెంకటప్పయ్య లోనికి వెళ్ళగా వరం ఘొల్లుమన్నాడు. లోకనాధం మరోవైపు ఏడుస్తున్నాడు )

దొంగ : రేయ్ ఆ దిక్కుమాలిన ఏడుపులు ఆపుతారా ? ఇద్దర్నీ పొడిచి పోలీసులకి సరెండర్ అయిపోనా ! దేనికిరా ....దేనికిరా...ఆ ఏడుపు....?

వరం : మావయ్య నాకు మాటలు రావటంలేదు నువ్వే చెప్పు....

లోక : అలాకాదులే ...నువ్వేట్రయి చెయ్యి....మొదలెట్టు....

దొంగ : ఆపండిరా.... ఆ ముసలాడు ఆ పిల్లను పెళ్ళిచేసుకుంటున్నాడు...అదేనా కారణం .

లోక : అవునండి భలే కరక్టుగా చెప్పేరు.

దొంగ : ఆడు పెళ్ళి చేసుకుంటే మీరెందుకురా ఏడవడం ?

లోక : ఆ పిల్లని ఫస్టు ప్రేమించింది నేను సార్ పెళ్ళంటూ చేసుకుంటే ఆ పిల్లనే చేసుకుంటానని వొట్టుకూడా వేసుకున్నా సార్ !

దొంగ : ఆ పిల్లకి ఆయన నచ్చుంటాడు సరే అంది.

వరం : ఆ పిల్ల అసలు పిల్ల కాదు సార్ వేరే పిల్ల. నన్ను కావాలని ఏడిపిస్తోంది.

దొంగ : ఏంట్రా ! ఆ పిల్ల ఆ పిల్ల కాదా ?

వరం : ఆ పిల్ల మూగపిల్ల కాద్సర్. నాటకం ఆడుతోంది.

దొంగ : దానికి ఏడవడం దేనికి తేల్చేసుకుంటే పోలే ?

వరం : అదే నాకు తట్టలేదు.... తేల్చేస్తా.... కానీ ఎలా ? నాన్న వాళ్ళ నాన్న
ఆ అమ్మాయిని అంటిపెట్టుకుని తిరుగుతున్నారు.

దొంగ : రేయ్ మీకసలు బుర్రలు లేవురా.... మూగ వాళ్ళకి ముక్కుగోకితే కోపం
వస్తుంది. ట్రై చెయ్యి....

లోక : అహ అద్భుతం....
( అంతలో వెంకటప్పయ్య లక్ష్మి వచ్చేరు )

వెంక : బాబూ నాన్నగారు ఇప్పుడే వస్తానంటూ వెళ్ళేరు నాకేమో బస్సు టైం అయ్యింది.

లోక : ( ఏడుస్తూ ) ఏవండీ అప్పుడే వెళ్ళిపోతున్నారా ?

వెంక : దేనికి బాబూ ఆ ఏడుపు నేను నాలుగు రోజుల్లో మళ్ళీ వచ్చేస్తాగా ...అమ్మాయి
జాగ్రత్త అసలే నోరు లేనిది....
( ఇది జరుగుతుండగా వరం లక్ష్మిని చూసి ముక్కుగోకేడు. కోపంగా అరిచి తన
చేతిలో పుస్తకాన్ని విసిరికొట్టింది
...ఏవిటే తల్లి ఎందుకంత కోపం.....
( లక్ష్మి సంజ్ఞలతో చెప్పింది )

వెంక : నిజంగానా...ఎందుకు బాబూ నా చిట్టి తల్లిని ఏడిపిస్తారు ? నాన్నగారికి
చెప్పాలా ? ఇలా అయితే నే పిల్లను తీసుకుపోతా. ఆ ముసలాయన కాళ్ళు చేతులూ
పట్టుకొని బతిమాలితే సరే నన్నానుగాని నా చిట్టి తల్లి ఏడుస్తుంటే చూట్టానికి కాదు.

లోక : నీకు బుద్దిందిరా....వెధవ పిల్ల చేష్టలు నువ్వునూ ...మీరేం భాదపడకండి
మావయ్యగారూ ?

వెంక : మావయ్యకాదు బాబాయి బాబాయి....నీకేం భయంలేదు. లోపలికి వెళ్ళమ్మ
నేవెళ్ళి త్వరగా వచ్చేస్తాగా....ఏదైనా కావాలంటే అన్నయ్య నడుగు ....
( ఘొల్లుమన్నాడు లోకనాథం )
( దొంగతో ) నాకు బస్సుకి వేళయ్యింది.
నేవెళ్ళేనని అల్లుడుగారికి చెప్పు బాబూ ( వెళ్ళిపోయేడు )

వరరం : కరెక్టు....ఆ పిల్ల మూగదే అందుకే అంతకోపం వచ్చింది.

దొంగ : ఇహ ...తర్వాత పన్జాడు...

వరం : మావయ్య.... మావయ్యా ఏడుపాపు. ఆడపిల్లలా ఏడుపేంటి.

ఈ లక్ష్మి నే ప్రేమించిన ప్రసన్నకాదు.

లోక : అయితే నన్నేం చేయమంటావ్ ?

( లక్ష్మీ లోపలినుంచి వచ్చింది. లోకనాథం వరం, ఆమెను చూస్తున్నారు )

వరం : అచ్చుగుద్దినట్లు ప్రసన్నలాగే వుంది. ఇప్పుడా ప్రసన్నని తీసుకొచ్చి ప్రక్కన నుంచో పెడితే ఎవరెవరో పోల్చుకోలేం....గ్యారెంటీ...

లోక : నాకు హెల్ప్ చెయ్యరా....

వరం : హెల్పా....ఎలా ?

లోక : కవలపిల్లల్లాంటి ఇద్దర్ని తండ్రీ కొడుకులెలా చేసుకుంటార్రా ? కాబట్టి మీనాన్న మనసు మార్చుకుంటాడు నేనో ఇంటివాడ్ని అవుతా .

( లక్ష్మీ ఓ కాగితం రహస్యంగా టేబిలు మీద పెట్టి వెళ్ళింది )

వరం : అద్భుతం మావయ్య....నీకూ బ్రైనుంది....పైగా అది పన్చేస్తోంది. ఇప్పుడే వెళ్తా

( బల్లపై కాగితం చూసేడు తీసి చదివాడు ‘ వరం నేను ప్రమాదంలో వున్నాను. నోరు తెరచి మాట్లడలేని పొజిషన్ వెంటనేరా ప్లీజ్ ప్రసన్న ? ”)

మావయ్య ఈ ఉత్తరం ఎక్కడిది.

లోక : నాకేం తెల్సు...ముందు త్వరగా వెళ్ళి ఆ పిల్లని తీసుకురారా ? వెళ్ళు ?

వరం : ఆశ్చర్యంగా వుందే అసలు. వుత్తరం ఇక్కడికి ఎలావచ్చింది ప్రసన్న వచ్చి వెళ్ళిందా ? ఎందుకొచ్చింది ? ఎందుకెళ్ళింది ? అసలు ప్రమాదం ఏవిటి ? సివిలా ? క్రిమినలా ? ఆశ్చర్యంగావుందే.

దొంగ : అరేయ్....ఇంట్లో చాకుగాని బాకుగాని, పచ్చడి బండగాని వుందా ?

వరం : వుండండి సార్ మా గొడవల్లో మేం వుంటే ?

దొంగ : వెల్లి ఆపిల్లను కల్సుకుంటే అన్నీ చెప్తుందిగా బ్రెయిన్ లెస్ ఫెలో .

వరం : కరెక్టు ఇంతవరకూ  నాకు తట్టలదేండీ  వెళ్తున్నా ( వెళ్లాడే )....

( దొంగ వెతుకుతున్నాడు )

లోక  : మిమ్మల్ని  చూస్తుంటే నాకేదో ధైర్యం  వచ్చేస్తోంది పట్టువదలని విక్రమాదిత్యుడిలా విసుగు లేకుండా వెతుక్కుంటున్నారు. నేను ఆ లక్ష్మిని స్వంతం చేసుకోవడం కోసం ఎదిరించి  పోరాడుతా. ఎంతకయినా  తెగిస్తా....ఇదే నాప్రతిజ్ఞ.

దొంగ : ఒరేయ్ బయటకెళ్ళి చేసుకోరా ఆ డ్రిల్లు....

లోక  : డ్రిల్లా నేను ప్రతిజ్ఞ చేసే సీను మీకు డ్రిల్లు లాగ వుందా ? ఎందుకు సార్ నామీద అంత కోపం ?

( ఇంతలో రామాంజనేయులు డాక్టర్ని  వెంట పెట్టుకొచ్చాడు )

రామా : ఇలారండి...కుర్చోండి  ( వెతుక్కుంటున్న  దొంగరాముడ్ని  చూసాడు డాక్టర్ )

ఒరేయ్ ....డాక్టరు  గారికి మంచినీళ్ళు  కావాలంటే ఇయ్యి....

లక్ష్మి లక్ష్మి...! ( లోపలికి వెళ్ళాడు )

డాక్టరు : అతనెవరూ ? అలా వెతుకుంటున్నాడు....ఏం పోయింది.

లోక  : మనశ్శాంతి ....మీరు

డాక్టరు : డాక్టర్ గోవర్ధన్ ...గొంతు  స్పెషలిస్టుని ....హార్ట్‌స్పెషలిస్టుని  ఆనందరావు నేను క్లామేట్స్‌మి.... సరే వాడికి  ప్రాక్టీసు  బాగా పెరిగిపోయి పెద్దవాడైపోయాడు....అసలు  నన్నడిగితే హార్టు కన్నా గొంతు గొప్పదంటాను....మీరేవంటారు ?

లోక  : హార్టు ముఖ్యం కదండీ !

డాక్టరు : అదే పొరపాటు ....హార్ట్  ఏం ముఖ్యమండీ ...పాడైపోతే ఆగిపోతుంది...అంతేగా...కానీ గొంతు అలా కాదు...పాడైపోతే  మాటరాదు ....ఎవ్వరితో మాట్లాడలేవు.... ఇంతకీ పేషెంట్ ఎవరూ .

దొంగ : లక్ష్మి అని

లోక : ( సిగ్గుపడుతూ ) లక్ష్మీ అని...!

డాక్టరు : వర్రీ కాకండి, నేనున్నాను....మీ మిస్సెస్సా ?

లోక : ఇంకా కాలేదండి.....

డాక్టరు : మీ ఆవిడికి మాట తెచ్చే పూచీ నాది.... ప్రామిస్....

( రామాంజనేయులు లక్ష్మిని తీసుకొచ్చాడు )

రామా : ఇలారా లక్ష్మీ ...కూర్చో డాక్టరుగారు గొంతు స్పెషలిస్టు నీకోసం తీసుకొచ్చాను లక్ష్మీ అని....

డాక్టర్ : చెప్పేరు...చెప్పేరు మీరు తప్పుకోండి ...నీ పేరేంటమ్మా .

రామా : లక్ష్మీ ....సుబ్బలక్ష్మీ....

డాక్టరు : వుష్...నాకు తెలియకనా ? ఎవ్వరూ మాట్లాడ్డానికి వీల్లేదు.... పేషెంట్‌కి ప్రాక్టీసు కావాలి.... చెప్పమ్మ ....నీ పేరేంటి ?

( లక్ష్మి పెదాలు కదిలిస్తూ ఏదో చెప్తున్నట్లు నటిస్తోంది) ఊ... నోరు తెరు...ఇలా నాలిక...ఆ ...అదీ....

( రామాంజనేయులు, లోకనాథం కూడా నాలుకలు బయట పెట్టేరు. డాక్టరు అమ్మాయి నాలుకను పరీక్షించేడు )

డాక్టరు : మీరు నాలికలు దాచి ఉంచుకోండి....ఈ పిల్లకి చిన్నతనంలో ఏదైనా యాక్సిడెంట్ జరిగిందా.... లేక ఎత్తయిన ప్రదేశం నుంచీగాని పడిందా ?

రామా : తెలీదండీ.కనుక్కుందాం....లక్ష్మీ నీకు చిన్నప్పుడు...

డాక్టరు : అతను కనుక్కుంటాడు అది సభ్యత మీరిలా రండి....మీరు కనుక్కోండి...

( లోకనాథం లక్ష్మిని పక్కకి తీసుకెళ్ళి సంజ్ఞలతో అడుగుతున్నాడు )....

ప్రజలకి తెలీక సగం రోగాలు తెచ్చుకుంటారు....వాళ్ళని ఎడ్యుకేట్ చెయ్యాలి....స్వరపేటిక ఎలా వుంటుంది ? స్వరనాళాలు ఎన్ని ? శబ్దం ఎలాపుడుతుంది. మాట ఎందుకు పోతుంది ? మీకు తెల్సా ?

రామా : తెలీదండి ....

డాక్టరు : నేచెప్తావినండి....స్వరనాళాలు  ఇక్కడుంటాయి.తప్పయితే  నన్ను చెప్పుచ్చుకొని కొట్టండి. తర్వాత స్వరపేటికి  ఇదిగో మధ్యలో మురుక్కాలవలాగా వుంటుంది. అది చాలా సున్నితంగా వుంటుంది. అంచేత చాలా జాగ్రత్తగా వాడుకోవాలి. తెల్సిందా ? ఎలా ?

రామా : నోరు మూసుకుని...

డాక్టరు : వెరీగుడ్ ....పొదుపుగా  వాడుకోవాలా....నేను ఇవన్నీ  తెల్సినవాడ్ని  కాబట్టి రోజూ పన్నెండు  నుంచీ ఒంటి గంటదాకా  మౌనవ్రతం  పాటిస్తాను. చాలా స్ట్రిక్ట్‌గా వుంటా. మా ఆవిడ  ముచ్చటపడ్డా సరే నోరు  విప్పను. అవును టైం ఎంతయింది.....

రామా : సరిగ్గా పన్నెండయ్యింది...

డాక్టరు : అమ్మో...టైమయింది... స్టార్టు ! ( లోకనాథం వచ్చేడు )

లోక   : ఆ కనుక్కున్నా డాక్టరు ....పైనించి  ఆ పిల్ల పడలేదట.
పిల్లపైనే ఏదో పడిందట ....
( డాక్టరు నే చెప్పాగా అన్నట్లు సౌంజ్ఞ చేసేడు ....)
( లోకనాథం  ఖంగారు పడ్డాడు )

లోక   : బావా డాక్టరు గారేంటి పాపాం ఇలా....

రామా : వుండరా ! లక్ష్మికి మాట వస్తుందంటారా. మెడిసెన్సు  రాసిస్తారా ?
( డాక్టరు సౌంజ్ఞ చేసేడు )

లోక   : ఏవిటీ ? ఆపరేషన్  చేయాలా ?

రామా : నీకు తెలీదు లేరా ....నే చూసుకుంటాగా !
( రామాంజానేయుల్నీ  వారించేడు డాక్టరు )

లోక   : థాంక్యూ డాక్టరు మీరు గొంతు స్పెషలిస్టు కారు. హార్టు స్పెషలిస్టులు.

రామ   : ఏమిటా పిచ్చికూతలు లక్ష్మి నువ్వులోపలికి వెళ్ళు.... నేను డాక్టరు గారితో క్లినిక్‌కి వెళ్ళి ఆయన ఒపీనియన్  కనుక్కొస్తాను. వెళ్ళు
( లక్ష్మి తలుపు లోపలికి వెళ్ళిపోయింది )

రామ : పదండి పోదాం. నేను వస్తాను మీతోటి.

( డాక్టర్ లోకనాధానికి షేక్ హ్యాండిచ్చి ధైర్యంగా వుండమని ఆ పిల్లకి మాట తెప్పించే పూచీనాది అని సైగ చేసి భుజం తట్టి బయటికి నడిచాడు – రామాంజనేయులు విసుగ్గా )

రామం : నీతో మీటింగ్ పెడతాడేమిటి ? నాకు చెప్పొచ్చుగా. ఏం డాక్టర్లో ఏమిటో ? లక్ష్మి జాగ్రత్తగా ? ఇప్పుడే వస్తా ( అంటూ బయటికెళ్ళాడు )

లోక : అహ, వెర్రీ ఆనందంగా ఉందేమిటి ? బావ లేడు. ఇదే చాన్సు . లక్ష్మీ లక్ష్మీ ?

( అనుకుంటూ లోపలికి వెళ్ళబోగా దొంగరాముడొచ్చి ఢీకొట్టాడు )

లోక : అబ్బ, దిమ్మ తిరిగిపోయింది. కాస్త చూసుకోవచ్చుగా,

దొంగ : ఆ పని నువ్వు చెయ్యొచ్చుగా తప్పుకో ( వరం కంగారు వస్తూ )

వరం : మావయ్యా, మావయ్య మరేం,

లోక : ఏరా ? ప్రసన్నని తీసుకొచ్చావా ? లోపలికి రమ్మను.

వరం : ప్రసన్న కన్పించలా ? ఇనిస్టిట్యూట్ కొచ్చి రెండ్రోజులైందట. నాకేమో ఇల్లు తెలీదు. ( జేబులోంచి ఉత్తరం తీసి ) ఆశ్చర్యంగా ఉందే ? ఈ ఉత్తరం ఎలా వచ్చిది ? ఎవరు తెచ్చారు ?

లోక : అయినా, ఈ చిక్కుల్లో ఉన్నవాళ్ళు చక్కగా వచ్చి చెప్పుకోవచ్చుగా, ఉత్తరాలు ఇంట్లోకి విసరికొట్టడం మంచి పద్ధతి కాదు. ఇప్పుడేమిటి చెయ్యడం ?

దొంగ : తప్పుకోండ్రా మిమ్మల్నే ?

లోక : మేం తప్పుకోం సార్ తన్నండి. నరకండి. తిట్టండి కొట్టండి.

వరం : మావయ్య ? ఇలారా ( చెవిలో ఏదో చెప్పాడు )

లోక : పిచ్చివెధవ లక్ష్మి, మీ ప్రసన్న ఒక్కరేనని, నాటకం ఆడుతోందని ఇంకా నీ అనుమానమా ?

వరం : అవును. ఏం ? నువ్వు నమ్మావా ?

లోక : తండ్రి తీసుకొచ్చి ఇది నా కూతురు బాబూ ? అని చెప్పాక్కూడా ఇంకా అనుమానమేంట్రా సరే, ఇప్పుడేం చేస్తానంటావ్.

వరం : నువ్వు నాన్నను తీసుకొని సినిమాకెళ్ళావనుకో, ఈ లక్ష్మి, ప్రసన్న ఒకరా కాదా అని పరిశోధించి కనుక్కుంటా.

లోక : పరిశోధించటం అంటే...

వరం : ప్రసన్నకి కొన్ని అలవాట్లు – అభిరుచులు, భయాలు ఉన్నాయి. ఫరెగ్జాంపుల్ నేనా లక్ష్మితో చచ్చిపోవాలనుకుంటున్నా. అని చెప్పాననుకో, ప్రసన్నే ఈ లక్ష్మి అయితే వెంటనే వాటేసుకొని వద్దు వరూ, సారీ, క్షమించు అంటుంది, అవునా ?

లోక : అదా ప్రోగ్రాం అద్సరే, ఇంత జరిగాక మీ నాన్న నాతో సినిమాకి వస్తాండటావా .

వరం : సినిమాకి కాకపోతే ఇంకేదైనా చెప్పు. ఓ గంట బయటికి తీసుకెళ్ళు మిగతాది నాకు వదిలేయ్.

లోక : సరేరా, మరి ఖర్చులకి డబ్బు కనీసం వంద అయినా కావాలి ఉన్నాయా ?

వరం : లేవు కానీ బీరువాలో ఉంటాయ్.

లోక : ఈ ఇంటికి వారసుడివిరా. తప్పేంలేదురా తీసుకో.

వరం : ఎలా ? తాళాలు లక్ష్మికిచ్చాడుగా

లోక : అయిందీ మీ నాన్న సామాన్యుడు కాడ్రా. ఇక తప్పదు. అట్లకాడ పెట్టి తిప్పు

వరం : ఎవరినీ నాన్ననా ?

లోక : బీరువానిరా ! తెరుచుకుంటుంది

వరం : ఆ లైన్లో నాకనుభవం లేదు. నువ్వు ట్రై చెయ్యి

లోక : నాకూ తెలీదు. పోనీ దొంగరాముడు గార్ని రిక్వెస్ట్ చేసుకుందాం.

వరం : మంచి ఐడియా పద

( ఇద్దరూ వెళ్ళి వెతుక్కుంటున్న దొంగరాముడికి చెరోవైపు నిల్చుని బతిమాలుతూ )

వరం : గుడ్ మార్నింగ్
లోక : నమస్తే
వరం : మీతో చిన్న పని పడింది.
లోక : మీరు ఎండచేత్తో చేసెయ్యగల్రు
దొంగ : ఏమిట్రా మీ గోల ? నా లాకెట్ దొరక్క నేనేడుస్తుంటే
వరం : చూస్తున్నాం తప్పస్సు చేస్తున్న మునీశ్వరుడిలాగా.
లోక : ప్రయోగాలు చేసుకునే సైంటిస్టులాగా
వరం : ప్రజల్ని పట్టించుకొని మంత్రిలాగా
బయటి ప్రపంచంతో సంబంధం లేకుడా వేతికేసుకుంటున్నారు
దొంగ : అబ్బబ్బ ఆపండ్రా ఏంట్రా రికార్డు, విషయం చెప్పండి.
లోక : మీరు కొండంత కష్టంలో వున్నారు. మాకు తెలుసు, కానీ చిన్న హెల్ప్ అబ్బే
చాలా చిన్నపని తాళాల్లేకుండా బీరువా తెరువగలరా ?
దొంగ : తెరవగలను ఏం .
వరం : కొంచెం డబ్బులు కావాలి... కానీ ఆ బీరువా తాళాలు మా నాన్న దగ్గరున్నాయి...
దొంగ : ఎంత కావాలి
వరం : ఎంతంటే ఒక్క వంద
లోక : నాకోటి అంతే.
( జేబులోంచి డబ్బు తీసి చెరో వందిచ్చాడు దొంగరాముడు )
దొంగ : దీనికింత మొగమాటం దేనికిరా తప్పుకోండ్రా
లోక : అలా అనకండి. దొంగరాముడైనా దొరాలాగా సొంతడబ్బు ఎంతకావాల్రా ? అని
అడిగి మరీ ఇచ్చేరు. మీ మేలు మర్చిపోం. బీరువా బద్దలు కొట్టైనా మీడబ్బు
మీకిస్తాం ప్రామిస్...
దొంగ : ఒరే ? ఆడబ్బు మీవేరా బీరువా ఎప్పుడో తెరిచేసి వెదికేసుకున్నా.

లోక : ఆ ?

వరం : బాబోయ్, అమ్మ పట్టుచీరలు, నా పర్సనల్ క్యాష్ ( అని లోపలికి పరిగెత్తాడు )

లోక : మీకంత నిజాయితే పనికిరాదు. నేనైతే చెప్పేవాడ్ని కాదు.

( రామాంజనేయులు బయటి నుండి లోపలికి హడావిడిగా వస్తూ )

రామం : లక్ష్మీ ? లక్ష్మీ ? లక్ష్మీ ఎక్కడ్రా ?

లోక : లోపులున్నట్టుంది. ఇంతకి డాక్టరేమన్నాడు ?

రామ : మాత్రలిచ్చాడు. రోజు వాడమన్నాడు .అన్ని సరిగ్గానే వున్నాయి. మాట రాకపోడానికకి కారణం అర్థం కావడంలేదన్నాడ్రా. అవసరమైతే వారం తర్వాత ఆపరేషను చేద్దామన్నాడు.

లోక : ఆపరేషన్ చేద్దామన్నాడూ ( వరం బయటికి వస్తూ )

రామ : నువ్వుండరా ? నీకన్నీ అనుమానాలే. ఒరే వరం డాక్టరు గారన్నారు ఇ పిల్లకేదైనా షాకింగ్‌గా సడన్‌గా చెబితే గబుక్కున మాట రావచ్చు ట్రైచేయండి. అన్నాడ్రా. ఏం చేస్తే బావుంటుంది.

లోక : బావా ? అలా అన్నాడా ?సపోజ్ లక్ష్మిని పిల్చి సడన్‌గా నేను నిన్ను పెళ్ళాడను అన్నావనుకో....

వరం : అది షాకింగ్ ఎలా అవుతుంది గుడ్ న్యూస్ అవుతుంది గానీ....

రామ : అది గాదురా ? మీ నాన్న పోయాట్ట... అని చెప్పాననుకో....

లోక : ఐడియా బాగానే ఉంది. కాని అంత నమ్మేట్టు చెప్పగలమా అని.

రామ : నే చెప్తాగా ? చూస్తూ ఉండు.

( రామాంజనేయులు లోపలికెళ్ళాడు )

లోక : లక్ష్మికి మాటొస్తే నాకూ ఆనందమే. కాబట్టి ఈ యజ్ఞంలో నేనూ సమీధనవుతా

( లక్ష్మిని తీసుకొని రామాంజనేయులు వచ్చాడు )

రామం:  చిన్నపిల్లవూ. దేవుడు నికింత అన్యాయం  చేస్తాడని అనుకోలేదమ్మా.

లోక   : ( ఏడుస్తూ )  బావా ! ఏమిటి బావా ! ఇదేమిటి బావా ! దేవుడికి ఎందుకింత కోపం ? చెప్పు బావా ! ( అని రామాంజనేయుల్ని  పట్టుకొని  వేలాడుతున్నాడు )

రామ  : నోరులేని  పిల్లగదా ? అని కూడా ఆలోచించలేదా. మాయదారి  దేవుడు. ఎలా చెప్పనమ్మ ? నోరు రావడం లేదు.

లోక   : ఎంత మంచివారు బావా !  ఆ దేవుడికి మనసెలా ఒప్పిందో ?

దొంగ : ఒరేయ్ ప్రిపరేషన్ చాలు పాయింట్లోకి వచ్చేయ్యండి.

రామం : లక్ష్మి బాధపడకు, నీకు నేనున్నాను.

లోక   : నేనూ వున్నా .....

రామం : చిన్నిపిల్లవి ధైర్యంగా ఉండాలి.  మీ నాన్న  వీధిలోకెళ్ళి రిక్షా ఎక్కాట్ట

( ప్రసన్న  చాలా  నిజయితీగా వింటూ రియాక్టు  అవుతోంది )

లోక   : అటునుంచి  దయ్యం లాంటి లారీ. ఎలా చెప్పేది బావా .

రామ  : ఇటునుంచి మీ నాన్న రిక్షా

లోక   :  అటునుంచి  లారీ !

రామ  : ఇటునుంచి  రిక్షా !

దొంగ : ఒరేయ్ ! నీయమ్మ తెమలండిరా ? త్వరగా ...

రామ  :  ఆ లారీ వచ్చి మీ నాన్నెక్కిన  రిక్షాని  ...శివ...శివ

లోక   : గుద్దేసింది....మీ నాన్న  స్పాట్ డెడ్  ...అంతే అక్కడికక్కడే చచ్చిపోయాట్టా

( ఆ మాట విని  లక్ష్మి లేచి నిలుచుంది. భయంగా చెవులు మూసుకుని పెద్దగా. నాన్నా  అంటూ  గావుకేక పెట్టింది )

రామా : లక్ష్మికి మాటొచ్చింది....లక్ష్మికి మాటొచ్చింది.

లక్ష్మి  :  నాన్న....నాన్న ...నిజం చెప్పండి... మా నాన్న  చనిపోయాడా...ఎక్కడ  ....నాన్న

రామా : అంతా ఒట్టిదే. డాక్టరు గారు నీకు షాకింగ్ ఏదన్నా చెప్పమంటేనూ అలా చెప్పా మీ నాన్నకేం కాలా. అహ.లక్ష్మికి మాటొచ్చింది. ఎంత ఆనందంగా వుందిరా. నా పాట నీనోట పలకాల చిలకా....నీ బుగ్గలో సిగ్గులొలకాల సిలక

( పాట పాడుతున్నాడు )

వరం : నాన్న,. ఏవిటా పూనకం నిన్నే...

లోక : బావా ....తప్పకుండా గుళ్ళోకెళ్ళి పూజలు చేయించాలి.

రామ :ఆగండిరా ...పూజలు నైవేద్యాలు తరువాత, లక్ష్మి ఏది నన్ను నోరారా బావా అని పిలవ్వా....ఊ ...పిలవాలి

( లక్ష్మి సిగ్గుతో తలవంచుకుని మైములో మాట్లాడాలని ప్రయత్నించింది )

అదేమిటిరా ఇప్పుడేగా మాట్లాడింది.

వరం : ఇంకో నాన్న పోయాడని చెప్పి చూడు ...పనిజరుగుతుందేమో

లోక : పూజలు చేయిద్దాం బావా అంటే తరువాత చూద్దాం అంటావా ....పైగా ఏదో. రామ అనో...కృష్ణ లోకనాథం అనో అంటంపోయి. బావా అను బావా అను అంటూ వెంటపడతావా ! దేవుడు వాయిసుని వాపను తీసేసుకున్నాడు.

రామా : ( చెంపలు వేసుకుంటూ ) అవున్రా ! పాపిష్టి వాణ్ణి తొందరపడ్డా క్షమించు స్వామీ ! క్షమించు లక్ష్మికి మాటివ్వవా !

దొంగ : నాకాస్త చోటివ్వు. తప్పుకోండ్రా

రామ : లక్ష్మి ! రామ ! కృష్ణ ! పరమేశ్వర ! అను,.... ఊ

( లక్ష్మి ప్రయత్నించింది పలికింది )

లక్ష్మి : రామ ! కృష్ణ !

రామ : ఆహా ! ఓహో !

లక్ష్మి : పరమేశ్వారా ! ఏడుకొండల్వామి !

లోక : బావా ! నన్ను బావా అను.. అని వెంటపడకు. పోతే ఇహరాదు మాటా !

రామ : లక్ష్మి ఇవ్వాళంతా దైవనామ స్మరణే చేసుకో ఏం లోపలికెళ్ళి ప్రాక్టీసు చేసుకో మిరియాలు పాలు త్రాగు

లక్ష్మీ : అలాగే నండి ( వెళ్ళింది )

లోక : బావా ఊరి బయట వినాయకుడి గుడికి వెళ్ళొద్దాం పదా ! నడుచుకుంటూ వెళ్దాం

వరం : నడుచుకుంటూ వెళితే దేవుడూ సంతోషిస్తాడు.

రామం : ఏడ్చావ్. అంత దూరం దేనికి ప్రక్కన సందులో గుడిలేదు.

లోక : అక్క బ్రతికున్నప్పుడు ప్రతిసారీ ఆ గుడికే వెళ్ళేది. మద్యాహ్నం అలా నిద్రపోయానా ! అక్క ఏడుస్తూ కల్లోకొచ్చింది.

వరం : అంటే ! అప్పుడే అమ్మక్కూడా తెలిసిపోయిందన్నమాట ?

రమా : సరేరా ! దైవకార్యం ! అందరం వెళదాం ! సరదాగా వుంటుంది లక్ష్మీకి కాలక్షేపంగా వుంటుంది

వరం : రాకరాక మాటొచ్చింది ! హాయిగా ఒంటరిగా మాట్లాడుకోనీ .... ఏం మావయ్యా !

లోక : అవును బావా ! నువ్వు నేను వెళ్ళొద్దాం పద ! దైవకార్యం ....పాపం చుట్టుకుంటుంది.

రామా : నాకర్జంటుగా ప్లీడరు గారింటికెళ్ళాల్సిన పనుంది రా ! ఓ గంట పడుతుంది.

వరం : అలాగా ! అయితే యింకేం ! ప్లీడరు గారింటికెళ్ళాల్సిన పనుందిరా ఓ గంట పడుతుంది..

వరం : అలాగా ! అయితే యింకేం ! ప్లీడరు గారింటికి మావయ్య కూడా వస్తాడు.

లోక : నీ బొంద ! ప్లీడరు గారు లేకపోతే అయిదు నిమిషాల్లో కొంపలో వుంటాడు.

రామా : నీ గోలేమిటో...గొడవేమిటో ..అర్థం కాకుండా వుందిరా ....లక్ష్మి లక్ష్మీ...

దొంగ : ఒరేయ్ ! ముసలోడా ! నువ్వాడిని తీసుకోని బయటికి పోతే యీ నీ కొడుకు ఆ పిల్లతో ఏదో డిస్కస్ చేస్తాడట.

రామా : ఏరా ! నిజమేనా ! లక్ష్మితో నీకేవిటిరా మాటలు నిన్నే ....మాట్లాడవేం ...

వరం : ఛీ...! ఛీ...! ఈ ఇంట్లో ఏదీ సవ్యంగా జరగదు కదా !

లక్ష్మీ : పిలిచారా బాబు... !

రామా : బాబుకాదు ...బావా అనాలి...మరేం ....

లక్ష్మీ : ఆ వినాయడకుడి గుడికెళ్ళి అర్చన చేయించుకురండి. నాకేం భయంలేదు... వరంబాబు నాకు తోడుగా వుంటారుగా !

వరం : వరం బాబా ...!

రామా : సరే ! నువ్వు చెప్పావు కాబట్టి తిరుగు లేదు. వెళుతున్నాను. లక్ష్మీ జాగ్రత్త పదరా ! ఒరేయ్ ! వరం ! లక్ష్మీ జాగ్రత్త

లోక : ఒరేయ్ వరంగా.... ఆల్‌ది బెస్టు. పద బావా ( రామాంజనేయులు లోకనాధం బయటికెళ్ళారు )

దొంగ : ఏంట్రా ఆ దొంగ చూపులు.,...ఆ పిల్లతో ఏదో మాట్లాడతానన్నావుగా... ఊ మాట్లాడు

లక్ష్మీ : నాతోనా ఏ విషయం గురించి బాబూ...

దొంగ : నేనలా వీధి అరుగుమీద చుట్ట కాలుస్తూ కూచుంటా ! పిచ్చవేషాలేస్తే. పిలు... పీక నొక్కుతా ( దొంగరాముడు బయటికి వెళ్ళాడు. లక్ష్మి కొంగు భుజం నిండా కప్పుకుని పెద్ద ముత్తయిదువులా )

లక్ష్మీ : ఏ విషయం గురించి మాట్లాడాలన్నావట, చెప్పు బాబు , భయం దేనికి ... ( సమాధానం చెప్పకుండా తలుపు మూస్తూ )

వరం : ప్రసన్నా ! ఇన్నాళ్ళకి ఒంటరిగా దొరికావు నిన్ను ఒదల్ను ! అమ్మదొంగా ! ఇంత నాటకం ఆడతావా !

( లక్ష్మీ భయంగా గదిలో అటు ఇటు పరిగెడుతూ )

లక్ష్మీ : ఏమిటి బాబూ ! ప్రసన్నేవరు ! నేను లక్ష్మీని ! నా మాట నమ్ము !

వరం : నువ్వు లక్ష్మీవే అని నమ్మాలి... ప్రసన్నా నేనంత పిచ్చివాడ్ని కాదు...నీచేతే చెప్పిస్తా చూడూ...

( లక్ష్మీ ...నాన్న ...అని అరుస్తూ సోఫాలో కూలిపోయింది. బయట దొంగరాముడి గొంతు ఒరేయ్ ! తలుపు తీయరా ! ఆ పిల్లను చంపావా. వరం వెళ్ళి తలుపు తీశాడు. దొంగరాముడు లోపలికొచ్చి పడిపోయిన లక్ష్మిని చూసి ) ఏరా ...మానభంగం చేశావ. నిజం చెప్పు నరుకుతా....

వరం : రామ ...రామ...ప్రసన్నా ..ఏవిటీ నాటకం. అంటూ దగ్గరికెళ్ళాను...

దొంగ : కొంప ముంచావు కదరా ! ఆ పిల్ల మూర్చపోయినట్టుంది.

వరం : మూగపోయి మూర్చలు పట్టుకున్నాయా ? ఇప్పుడేం చెయ్యాలి.

దొంగ : చెక్కభజన చెయ్యాలి. నేవెళ్ళి నీ బాబుని తీసుకొస్తా ? ఇల్లు జాగ్రత్త. ఛీ...ఛీ... పిల్ల జాగ్రత్త

వరం : ఇదెక్కడి గొడవరా దేవుడా... ఏవండీ...మిమ్మల్నే నీళ్ళు చల్లితే వుపయోగం వుంటుందేమో ( లక్ష్మీ కళ్ళు తెరిచింది )

లక్ష్మీ : నేనెక్కడున్నాను. నా కేమయింది....

వరం : ఏం కాలేదు ప్రసన్నా ! సారీ లక్ష్మీ గారూ ! వున్నట్టుండి మీరు కుప్పకూలిగపోయారు. మీకు ముర్ఛరోగం వుందా ?

లక్ష్మీ : కాస్త ! కళ్ళు తిరిగాయి ! అంతే

వరం : బ్రతికించారు. మీకేమయిందోనని హడలిపోయా. నన్ను క్షమించు లక్ష్మీ.నేనో పిల్లను ప్రేమించా ఆ పిల్ల పేరు ప్రసన్న. అచ్చు గుద్దినట్లు జిరాక్స్ కాపీ తీయించినట్లు మీలాగే వుంటుంది. అదే రూఎర, అదే లావు. మనిషిని పోలిన మనుషులంటారని విన్నానుగాని మరీ ఇంతలా పోలికలుంటాయని ఊహించక తొందరపడ్డాను. మీరిద్దరు కవల పిల్లలంటే ఇట్టే నమ్మేస్తారు. తెలుసా ?

లక్ష్మీ : ఏ మన్నారు ? మీ ప్రసన్న అచ్చు నా లాగే వుంటుందా ? నిజంగానా ? చెప్పండి ! ఎక్కడుంది ?

వరం : నేను చెబుతున్నది పచ్చి నిజం. ముమ్మూర్తులా మీలాగే ఉంటుంది. అదేవిటీ, ఆ కంగారు దేనికి.

లక్ష్మీ : అయితే ! ఆ ప్రసన్న మా సరస్వతీ అక్కయ్యా ? చెప్పండి ఎక్కడుంది ? ఎలా వుంది ? చదువుకుంటుందా ,

వరం : మీ సరస్వతీ అక్కయ్యా ఆవిడెవరు ?

లక్ష్మీ : నేను మా సరస్వతి అక్కయ్య కవల పిల్లలం నాకు ఆరు నెలల వయసున్నప్పుడు నీళ్ళు పోసి మా అమ్మ మా యిద్దర్ని పడుకో బెట్టిందిట. వీధి కుక్కొచ్చి అక్కయ్యని...

వరం : ఆ... అక్కయ్యని ....చెప్పండి...

లక్ష్మీ : ఎత్తుకెళ్ళిపోయిందిట

వరం : మైగాడ్ నిజంగానా ?

లక్ష్మీ : మాఅమ్మా నాన్న అక్క గురించి ఆర్నెల్లు ఆంధ్రప్రదేశ్ మొత్తం తిరిగారు. అడగని మనిషి లేదు. మొక్కని దేవుడ్లేడు. ఇన్నేళ్ళకి అక్క ఆచూకీ తెలిసింది. మా నాన్నుంటే ఎంత సంతోషించేవారో ?

వరం : మీనాన్నగారు బ్రతికే వున్నారుగా !

లక్ష్మీ : ఇప్పుడిక్కడుంటే అంటున్నా ....నాన్న ...అక్క బ్రతికేవుంది

( అరచింది వెంకటప్పయ్య వచ్చాడు )

వెంక : అమ్మా నువ్వేనా పిలిచింది. నీకు మాటొచ్చిందా అమ్మా ! ఎంత చల్లటి ! కబురమ్మా ! నీ మంచి తనమే నిన్ను కాపాడిందమ్మా.

లక్ష్మీ : నాకు మాట రావడం కాదు నాన్న. ఇంకో శుభవార్త నాలాగే వుండే సరస్వతి అక్కయ్యని కుక్కెత్తికెళ్ళిందని చెప్పావుకదా ?

వెంక : చెప్పానా...చెప్పకుండా ఎలాగమ్మ దాచటం...ఆకుక్క కనిపించిందా అమ్మా

లక్ష్మి :కుక్కకాదు నాన్న... అక్క కనిపించింది బ్రతికేవుందిట. పేరు ప్రసన్నట. ఇదిగో ఈ బాబు చెప్పాడు.

వెంక : ( ఉద్వేగంతో ) నిజంగానా బాబు, కుక్క పాలైన నాకూతురు బ్రతికేవుందా ? చెప్పు బాబు ఎక్కడుంది ? ఎలా వుంది....చెప్పు బాబు.

లక్ష్మి : చెప్పండి కుక్కెత్తికెళ్ళిన అక్క క్షేమంగా వుందని చెప్పండి. కన్నతండ్రి ఆత్రాన్ని అర్థం చేసుకోండి.

వరం : ఆగండి...ఆగండి... నాకంత అయోమయంగా వుంది. వూరికుక్క పిల్లనెత్తుకెళ్ళడం ఏవిటీ ? ఈ వూళ్ళో పడేయటం ఏమిటీ .

లక్ష్మి : పదండి వెడదాం. ముందు చెప్పేది వినండి. ప్రసన్న నాకు కలిసి పది రోజులయింది. ఏమైందో తెలియదు.

వెంక : బాబు, ఈ పేదవాడితో ఆడుకోకు బాబు. నీకేం కావాలన్నా ఇస్తాను కానీ నా సరస్వతిని నాకు చూపించు. నీ పాదాలు పుచ్చుకుని ప్రార్ధిస్తున్నాను. పద బాబు.

లక్ష్మి : సరస్వతి అక్కయ్యను ఈ బాబు ప్రేమించాడట నాన్న.

వెంక : బాబు మీరెం భయపడకండి. ఈ యిద్దరికి పెళ్ళి నేను చేయిస్తాను.

లక్ష్మి : పదండి....! అక్కను చూపించండి.

వరం : అయ్యో ! మీరు నా మాట అర్థం చేసుకోవడంలా ప్రసన్న ఇల్లు కాని అడ్రసుకానీ నాకు తెలీదు. మేమిద్దరం టైపు ఇన్‌స్టిట్యూట్‌లో కలుసుకునేవాళ్ళం. అక్కడే పలకరించుకున్నాం. ప్రేమించకున్నాం.

వెంక : ఏమిటి బాబు... దిక్కులేని దారిలాగా టైపు ఇనిస్టిట్యూట్‌లో ప్రేమించావా ? దానికి నేనున్నానుబాబు. మీ యిద్దరిని ఇంటికి తీసుకుపోతాను. అక్కడ ప్రేమించుకుందురుగానీ పద....

లక్ష్మి : నాన్న నాకర్థం అయ్యింది. ఆ ప్రసన్న అనబడే కుక్కెత్తుకెళ్ళిన సరస్వతీ అక్కయ్యను ప్రేమించాడు. సినిమాలని, షికార్లని తిప్పాడు. అక్క నాలాగే అమాయకురాలు. నమ్మింది అక్కయ్య......

వెంక : ఆ ...నిజంగానా ...!

లక్ష్మీ : ఆ సంగత్తెల్సి ఈ హీరో మొహం చాటేసుంటాడు. అక్క ఏ నుయ్యో గొయ్యో చూసుకునుంటుంది.

వరం : వామ్మో నాకేం తెలీదు. ఇదంతా కట్టుకథ, నా మాట నమ్మండి.

( రామాంజనేయులు లోకనాథం దొంగరాముడూ ప్రవేశం )

రామా : లక్ష్మీ...లక్ష్మీ ఏమైంది. పడిపోయావట ఎలా ఉంది.

వెంక : ఎంతపని జరిగిందమ్మా పుట్టగానే కుక్కెత్తుకెళ్ళింది. వయస్సు రాగానే ఈ నక్క పాలైనావామ్మ నేనెలాగమ్మ బతికేది ( అంటూ గుండె చేత్తో పుచ్చుకున్నాడు )

రామా : ఏవిట్రా ఏమైంది ? ఏవిటీ గోల

లోకం : ఏరా ఏవిటి ? అసలు కదిపావా ?

వరం : ఏవిటి కదిపేది ? ఇలా అన్నా డొంకంతా కదిలింది.

లక్ష్మీ : నాన్న ! గుండెనొప్పా నాన్న. పద రెస్టు తీసుకుందువుగాని

( రామాంజనేయులు లక్ష్మీ, వెంకటప్పయ్యని తీసుకెళ్ళారు )

వరం : ఇదెక్కడి గోలరా బాబు, కుక్కలెత్తుకు పోవడం ఏమిటి ? అంతా సినిమా కథ లాగా ఉంది. మొత్తానికి ఓ సంగతి తెలిసింది. మావయ్య ఈ లక్ష్మీ ప్రసన్నలు ఒక్కరు కాదు. ఇద్దరు.

లోక : అహ ! ఎంత చల్లని వార్త చెప్పావురా ! ఈ బతుక్కిది చాలు.

వరం : మావయ్యా నిన్నే అయినా నీకెందుకింత సంతోషం.

లోక : కాకపోతే ఏవిట్రా ? లక్ష్మీని నే చేసుకుంటా. ప్రసన్నని నువ్వు కట్టుకో అంతే ! కథ సుఖాంతం శుభం కార్డు రెడీ చెయ్యి

వరం : ఆగాగు అంత దూకుడు వద్దు. లక్ష్మి ప్రసన్నలు అక్కా చెల్లెళ్ళు కూడానట.

లోక : అవునుచెప్పావు.

వరం : నువ్వు నేను మేనమామ మేనల్లుళ్ళం కాదా !

లోక : అయితే

వరం : ప్రసన్నని నేను చేసుకుంటే లక్ష్మి నీ కూతురు వరస అవుతుంది. ఎలా చేసుకుంటావు ?

లోకం : చచ్చాం ఇదో కొత్త మలుపా? ( దొంగ రాముడు లోపలినుంచి వచ్చాడు )

వరం : ఆయనకెలా ఉంది ? ఏం చేస్తున్నాడు.?

దొంగ : చాలా సంతోషంగా వున్నాడు. పగలబడి నవ్వుతున్నాడు. తప్పుకో మందులు కావాల్ట వెళ్ళి కొట్టు కొస్తా.

వరం : మందులు తీసుకొస్తారుగానీ కొట్టుకొస్తానంటాడేమిటి ? మావయ్య .

లోక : వాడు దొంగరావుడ్రా. కొట్టుకు రాక తీసుకొస్తాడా. అది వదిలేసి ఇదివిను. జీవితం చాలా చిత్రమైనది వరం. ఏ సంగతిని జీవితంలో చెప్పదగూడదని గుండెల్లో పాతేసానో ఆ సంగతి ఇంత త్వరగా అందులో నీకు చెప్పాల్సివస్తుందని ఊహించలేకపోయాన్రా

వరం : ఏమిటి మామవయ్య ? నాకు ఒక్క ముక్క అర్ధం కాలా .

లోక : రహస్యం ! నా జన్మరహస్యం. ఎక్కడ పుట్టానో, ఎందుకు పుట్టానో, ఎవరికి పుట్టానో తెలియదు. పసిగుడ్డుగా ఉన్నప్పుడు ఓ కాకి. ఎత్తుకొచ్చి మీ తాతదొడ్లో చెట్టుపైన పెట్టిందిట. అది చూసి మీ తాతవాళ్ళు నన్ను తీసుకొని పెంచుకున్నారు. ఇదీ నా జన్మ రహస్యం.

వరం : అంటే నువ్వు ...నువ్వు....

లోక : నీకు మామయ్యను కాను.....మంచి ఫ్రెండ్ని..అంతే

వరం : మామయ్య ( అరిచాడు )

# లైట్స్ ఆఫ్ - ఆన్

లోక : ఎవరు ! నన్ను పిల్చింది ?

పాట : నీవేనా నను పిలిచేది. నీవేనా నను తలిచినది. నీవేనా నా మదిలో నిలచి... ( వరం శాలువతో ప్రశేశించాడు పాట పాడుతూ ) దారి చూపిన దేవత నీచేయి ఎన్నడు వీడక ! ) లక్ష్మి రామాంజనేయులు ప్రవేశం )

రామ : ఇప్పుడు ఎలా వున్నాను ? ( ప్యాంటు, షర్టు టక్ చేసాడు )

లోక : ఎవరండి ? ఎవరుకావాలి ? మిమ్మల్నే ?

రామం : సర్లేరా ! ముతకహాస్యం నువ్వూనూ .

లోక : బావా ? నువ్వా ? నిజంగా నువ్వేనా ? ఏమిటి పగటివేషం ?

రామ : లక్ష్మి మొన్న మాటల్లో మీరు ప్యాంటు, షర్టు వేసుకుంటే అమెరికా యాత్రలో అక్కినేనిలా ఉంటారంటేనూ.

లోక : ఈ అవతారం ఎత్తావన్నమాట ?

రామ : ఎలా ఉన్నాయిరా ? నప్పాయా ?

లోక : రెండుకళ్ళు చాలడంలేదంటే నమ్ము. ఆహహ ఏం కళ ! ఏం వర్చుస్సు ! రేయ్ వరంగా త్వరగారారా. వెర్రిపీనుగా ( వరం శాలువాతో వచ్చాడు )

వరం : ఏవిటి మావయ్య ? ఎవరీయన ?

లోక : సరిగ్గా చూడు ఎప్పుడన్నా చూసినట్లు అనిపిస్తోందా .

వరం : నాన్న ? నువ్వా ఏవిటి నాన్నా ఇలా అయిపోయావు. ఎలాంటివాడివి ఎలా తయారయావు ?

రామం : ఏవిట్రా ఇందాకటి నుంచి చూస్తున్నాను. తప్పేముందిరా ? పంచె, బదులు ప్యాంటు, బారు లాల్చి బదులు కలరు షర్టు చెప్పులు బదులు షూస్ అంతేకదా ,

లోక : బావా ? చిన్న సజెషన్. పన్లోపని మీసం గూడ పెంచి పారెయ్. చిన్నప్పటి షేక్స్‌పియర్‌లాగుంటావ్.

రామ : సరేరా ! బట్టలంటే రెడీమేడ్ దొరుకుతాయి గానీ, మీసం ఆరేంజిలో మొలవాలంటే కనీసం ఓ మాసమన్నా పడుతుంది చూద్దాం లక్ష్మిని గూడ అడిగి.

వరం : మామయ్య మొన్న హీరో నాగేశ్వరరావుగారు విగ్గేదో అమ్మకానికి పెట్టారన్నావ్.

రామం : అలాగా రేయ్ పోనీకండి...అందుబాటులో వుంటే మన వేపుచ్చేసుకుందాం. బాగా అచ్చొచ్చిన విగ్గులు.

లోక : అలాగా ! అంటే ఇంకా చాలా చిత్రాలు, విచిత్రాలు చూడానల్నమాట.

రామం : రేయ్ నా సంగతి మీకనవసరం. పిచ్చి పిచ్చి కామెంట్స్ పాస్ చేసారంటే బయటికి గెంటడం ఖాయం. ఆ లక్ష్మీ ! లక్ష్మీ ! నేనలా బ్యాంక్ దాకా వెళ్ళొస్తా. ఇల్లు జాగ్రత్త

లక్ష్మీ : ఆ ....వచ్చేటప్పుడు నే చెప్పిన కాస్మొటిక్సు తీసుకురండి.

రామ : అలాగే ( వెళ్ళిపోగా )

వరం : మావయ్య ఆయన నిజంగా మా నాన్నేనా !? నమ్మలేకపోతున్నా

లోక : ఆడగాలి సోకితే అంతేరాబాబు – ఇప్పటికైనా కళ్ళు తెరిచి నాన్నని కాపాడుకో

వరం : ఎలా !

లోక : రేయ్ ! లక్ష్మీ ప్రసన్నలు ఒకరు కాకపోతే నాకు సాయం చేస్తానని మాటిచ్చావు గుర్తుందా ?

వరం : ఉంది. కాని ఏం చెయ్యను.

లోక : ఏం వద్దు. ఆ లక్ష్మిని నువ్వుగాని చేసుకుంటే చచ్చిపోతానని బెదిరించు. భయపడి దోవకొస్తాడు.

వరం : వస్తాడొస్తాడు. అలాకాక చావరా చూస్తానంటేనో....

లోక : అనద్ర ...అనలేదు... ఎంతయినా కన్న కొడుకువి గద. కుక్కలూ, నక్కలు, తెచ్చిపడేసిన టైపు కాదు గదా ?

వరం : మావయ్య అసలు నిన్ను ఆ లక్ష్మీ ప్రేమిస్తోందో లేదో కనుక్కున్నావా ? తీరా నేను నాన్నకి. చచ్చిపోతాను అని చెప్పాక లక్ష్మీ నిన్ను అన్నయ్య అంటేనో...

లోక : అంటే లక్ష్మికి నామీద ప్రేమలేదని నీ డౌటా ! సరే ! అయితే ఆ లక్ష్మీ చేత చెప్పిస్తా. ఆ తర్వాతే నువ్వు ప్రొసీడవ్వు ఓకే!

వరం : ఓకే ! కాని నేను సీన్లో నేనుండొచ్చా ?

( లక్ష్మి కాఫీ కప్పుతో వచ్చింది )

లక్ష్మీ : ఇద్దరూ ఇక్కడే వున్నారా. ఓ కప్పే తెచ్చా.

లోక : ఏం పర్లేదు. ఆ కప్పు నాకివ్వండి. రేయ్ నువ్వు లోపలకి వెళ్ళు కాఫీ కలుపుకొని తాగు.

వరం : కాని మావయ్య మరి – మరి...

లోక : మామయ్య మామయ్య అంటూ మీటింగు పెట్టక వెళ్ళు టైము....

వరం : సరే వెడుతున్నా మావయ్య ?

లోక : పద ! పద మావయ్య. మావయ్య అనొద్దన్నానా ! వెళ్ళవతలికి అంతా అబ్బపోలికే

లక్ష్మి : ఎందుకో కోపం ? పాపం ఆ పసివాడు ఏమన్నాడని ? మావయ్య అనేగా దాంట్లో తప్పేముంది.

లోక : ఏం చెప్పమంటారు. అదో పెద్ద కథ – తర్వాత చెప్త. ఇంతకీ నా గురించి మీ అభిప్రాయం ఏవిటి .

లక్ష్మీ : పంతం, పట్టుదల ఎక్కువ అనుకున్నది సాధించేదాక నిద్రపోరు ఏదైనా పని అప్పగిస్తే నిజాయితీగా పూర్తి చేస్తారు

లోక : చాలా థాంక్యూ లక్ష్మి ఏకవచనం వాడుతున్నందుకు ఏం అనుకోరుగా ? నా గురించి కరెక్టుగా చెప్పావు. ప్రేమించిన వాళ్ళకోసం ప్రాణాలిచ్చే టైపు. నేనంటే నికిష్టమేనా ? నిజాయితీగా చెప్పు

లక్ష్మీ : దేనికి ? నా ఇష్టాలతో మీకేం పని. నేనెవర్ని ? మీరెవరు .

లోక : నిన్ను గుడ్డిగా ప్రేమిస్తున్న ఓ అభాగ్యుడ్ని, నిన్ను చూసిన మొదటి చూపులోనే మనసు పారేసుకున్న. నీకు గొంతు లేదని, మూగదానివని తెల్సి కుళ్ళి కుళ్ళి ఏడ్చా. దేవుణ్ణి నిలదీసా ఏవిటా అన్యాయం అని.

లక్ష్మీ : అంటే నన్ను అంతగా ప్రేమిస్తున్నారా .

లోక : ఇంకా అనుమానమా ? నా గుండెల్ని చీల్చి చూడు. నువ్వేవుంటావు. నిద్దట్లో నా కలవరింతలు విను. నీ గురించే ఇంతెందుకు దొడ్లో గోడమీద నీ పేరు రాసింది ఎవరు ? నేనే !

లక్ష్మీ : మీరా ? మా బావగారేమో అనుకున్నా

లోక : ఆయన మాట నా దగ్గర ఎత్తొద్దు. వొళ్ళు భగ భగ మండిపోతుంది. ఈ వయస్సులో ఆయనకి పెళ్ళా ? పైగా నీతో ? సిగ్గుండొద్దు.

లక్ష్మీ : పోన్లేండి. ఆయన వూసుదేనికి. నేనంటే ఎంతో ఇష్టం. నా కోసం ఏం చెయ్యమన్నా చేస్తానంటారు. అంతేగా.

లోక :ఎగ్జాట్లీ ! అంతే ! చెప్పండి ? ఏం చెయ్యమంటారు ? సముద్రంలో పడిపోనా ? కొండమీంచి దూకెయ్యనా ? రైలుకింద తలపెట్టనా ?

లక్ష్మీ : పాపం ! తలపెట్టక్కర్లా. తప్పిపోయిన మా సరస్వతీ అక్కయ్యని ఒక్కసారి చూపించండి చాలు.

లోక : తప్పిపోయిన అంటే చిన్నప్పుడు కుక్క ఎత్తుకెళ్ళిన మీ అక్కా ?

లక్ష్మీ : అవును బతికేవుందని ప్రసన్న పేరుతో ఈ వూళ్ళోనే వుందని వరం బాబు చెప్పాడు. అతడ్ని అదిరించో బెదిరించో మా అక్క ఆచూకీ తెల్సుకొండి చాలు.

లోక : ఆచూకీ తెల్సుకోవడం కాదు. ఆవిడ్ని తెచ్చి మీ ముందు నిలబెడతాను. ప్రామిస్. మరి అప్పటికైనా నా ప్రేమని...

లక్ష్మీ : మా అక్కని చూపించిన వాళ్ళు నాకు దేవుడితో సమానం. ఈ సంగతి ఇంకెవ్వరికీ, ముఖ్యంగా మీ బావగారికి తెలీనికండి. బాధపడతారు ( వెళ్ళిపోయింది )

లోక : ఇంతకీ నన్ను ప్రేమిస్తున్నట్ట ! లేనట్ట ? అక్కని చూపించిన వాళ్ళదేవుడితో సమానం అంటే అది భక్తా ? గౌరవమా ? ప్రేమా ? ప్రేమే అయ్యుంటుంది కాకపోతే....

వరం : మావయ్య ఏమైంది సక్సెస్సా.... ఓకే అందా ?

లోక : నీకు దేనికిరా ! నీ సంగతి నువ్ చూసుకొని, తగలడొచ్చుగా, వెధవ ఆరాలు నువ్వూనూ, సరేరా, నువ్వు ప్రసన్న అనే పిల్లని ప్రేమించావు ? ఆ పిల్ల నిన్నేప్పుడైనా మీరు దేవుడికింద లెక్క అందా ?

వరం : ఊహూ ! అలా ఎప్పుడూ అన్లేదు.

లోక : అన్లేదా – అయితే ఏవనేది .

వరం : అవి నా పర్సనల్ విషయాలు చెప్పగూడవు.

లోక : ఓరి నీ సిగ్గు చివడా ! సరే వదిలెయ్యి . నువ్వు ప్రేమించిన ప్రసన్న చిన్నప్పుడు కుక్క ఎత్తుకెళ్ళిన సరస్వతా ?

వరం : అని వాళ్ళు అంటున్నారు. నాకు తెలీదు.

లోక : ఇప్పుడా ప్రసన్న ఎక్కుడుంది. వాళ్ళ ఇల్లెక్కడ ? వాళ్ళ ప్రజెంటు ఫాదర్ ఏం చేస్తుంటాడు.

వర : ప్రసన్న కనిపించి పదిరోజులైంది. అదేగా నావ్యథ. ఇల్లు తెలీదు. అవునూ ఈ విషయాలు నీకు దేనికి ?

లోక : రేయ్ వరం ! నువ్వే నాకు ప్రేమభిక్ష పెట్టాలి. ఆ ప్రసన్న ఉరఫ్ కుక్కల సరస్వతి ఎక్కడుందో చెప్పరా ? ప్లీజురా.

వరం : ఏవిటి మావయ్య నువ్వంటున్నది. ఆ సరస్వతి ప్రసన్నలు ఒక్కరే అని నీకనుమానమా ? ( లక్ష్మి పని మీద అటుగా వచ్చింది )

లోక : ( మూడ్‌మార్చి కోపం నటిస్తూ )
వెధవ్వేషాలు వేసావంటే మక్కెలు ఇరగదీయగల్ను.

ఆమె ఎవరనుకుంటున్నావ్. రేయ్ మర్యాదగా కోపరేట్ చేస్తావా సరే. లేదూ ప్రసన్న మిస్సింగ్ అని కంప్లయింట్ ఇప్పించి నిన్ను బొక్కలోకి తోయించగలను. జాగ్రత్త అంతే

( లక్ష్మి వెళ్ళిపోగా, మళ్ళీ ప్రాధేయపడుతున్నట్టు )

రేయ్ చెప్పరా నీ కాళ్ళు పుచ్చుకుంటా...

వరరం : మావయ్య నిన్నే ఏవిటి ఆరోగ్యం ఎలా వుంది ? రెస్టు తీసుకుంటావా .

లోక : రెస్టుకాదురా ! ఇది నాకు టెస్టురా బాబు. చెప్పరా అక్కల కుక్క ఛీ !...ఛీ... కుక్కల అక్క ఎక్కడుందో చెప్పరా ?

వరం : అయ్యోయ్యో నాకు తెలీదూ మావయ్య. నీ మీద ఒట్టు ప్రసన్నని కలవాలని కలిసి తనతో మానాన్న ఒప్పుకోక పోయినా పెళ్ళి చేసుకుంటానని చెప్పాలని తహ తహలాడుతున్నా ( వెంకటప్పయ్య పేపరుతో వస్తూ )

వెంక : అయితే మాత్రం ఇలా ప్రకటనలిచ్చి ప్రాణాలపైకి తెచ్చుకుంటావా ?

లోక : ప్రకటనా ?ప్రాణాలా ?

వెంక : చిన్నతనంలో తప్పిపోయిన మా సరస్వతిని మాకు చూపించడం కోసం ప్రాణత్యాగం చేస్తానని ప్రకటనిస్తావా ? ఎందుకు బాబు ఇంత తొందరపడ్డావు

వరం : ప్రకటన ప్రాణ త్యాగం – ( పేపరు చదువుతున్నాడు ) ప్రకటన. ప్రసన్న మనం కల్సుకొని పది రోజులైంది నాకు పది యుగాలుగా ఉంది. నిన్ను తలవని క్షణం లేదు నీ గురించి వెతకని చోటు లేదు. మా నాన్న మన పెళ్ళికి అంగీకరించార్న శుభవార్త నీకు చెప్పాలని ఎదురు చూస్తున్నా. నువ్వు నిజంగా నన్ను ప్రేమించిన మాట నిజమైతే ఈ రోజు సూర్యాస్తమయంలోపుగా మా యింటికి రావాలి. అలా రాని పక్షంలో, నా పైన నీ ప్రేమ చెరిగిపోయిందని, నువ్ మనసు మార్చుకున్నావాని అనుకొని నేను నీ పేరు స్మరిస్తు అందరి సమక్షంలో ప్రాణత్యాగం చేస్తా. ఇది బెదిరింపుకాదు. విన్నపం నా ప్రేమకి నిజాయితీకి పరీక్ష – ఇట్లు వరప్రసాదం – జెండాచెట్టువీధి సలీంనగర్ విజయవాడ ఆశ్చర్యంగా ఉందే ?

వరం : రేయ్ వరం ఎంతగొప్పవాడివిరా. ఈ మావయ్య గురించి ఇంత రిస్కు తీసుకుంటున్నావా ? అపార్థం చేసుకున్నా నన్ను క్షమించరా.

వరం : అబ్బ వుండు. నీగోల నాకర్థం కాదు.
ఆశ్చర్యంగా ఉందే ఫోటో కూడా నాదే.
( లక్ష్మీ వెంకటప్పయ్యతో )

లక్ష్మీ : మీరు చెబుతున్నది నిజమా ? మన వరంబాబు అంత గొప్పవారా ?

వెంక : పేపర్ చూడమ్మా నీకే తెలుస్తుంది.

వరం : ఆశ్చర్యంగా ఉందే.

వెంక : బాబు పెద్దవాడిని చెబుతున్నా తొందరపడకు మనసు మార్చుకో మా గురించి నువ్వు చచ్చిపోవడం మేం భరించలేంబాబు.

వరం : అప్పుడే పదయిపోయింది. ఆశ్చర్యంగా ఉందే

లోక : అబ్బ ఇంకా పదేనా

లక్ష్మీ : అంటే ప్రసన్నని మీరు నిజంగానే ప్రేమించారాని అనుమానంగా వుంది. అయినా ఆ పిల్ల పాపం ఎక్కడుందో. ఏ పరిస్థితుల్లో ఉందో, సాయంత్రంలోగా రాకపోతే.

వెంక : అవునయ్య అది నిజమే కనీసం ఓ వారం రోజులన్నా టైమిచ్చి ఉండాల్సింది. తీరానువ్వు ప్రాణాలు తీసుకున్నాక ఆ పిల్లగాని వస్తే.

లోక : ఎప్పుడొచ్చినా పర్లేదు వస్తే చాలు.

వరం : ఆశ్చర్యంగా ఉందే.

లక్ష్మీ : లేదులే నాన్న. ఆ పిల్లని బెదిరించడానికి ఇలా ఇచ్చుంటారు కదబాబు.

వరం : కాదు నేబాగా ఆలోచించే ఈ నిర్ణయానికొచ్చా. ఈ ప్రకటన తిరుగులేదు. ప్రసన్న రాకపోతే చావడం ఖాయం ఆశ్చర్యంగా ఉందే.

వెంక : నిన్ను చూస్తుంటే గర్వంగా ఉందయ్య . వుండాలి. మగ వాడికి ఆమాత్రం తెగింపు త్యాగబుద్ధి ఉండాలి. ఒక్క దెబ్బతో సలీం దేవదాసు, మజ్నుల స్థాయికి ఎదిగిపోయావు. చరిత్రలో కలకాలం ఉండిపోతావు. వెళ్ళిపో బాబు. హాయిగా ఆనందంగా గర్వంగా వెళ్ళిపో.

లక్ష్మి : నాన్న బాబుని కంగారు పెట్టకండి. అలా కూర్చోబాబు. టీగాని, పాలుగాని, కాఫీ గానీ

వరం : నాకేం వద్దు ఆశ్చర్యంగా ఉందే ?

వెంక : అమ్మ ! అలా మార్కెట్‌కి వెళ్ళి ఓ పూలదండ, కాశ్మీరు శాలువ తీసుకొస్తా. ఎంతయినా మన ససర్వతిని మనకి చూపించడం గురించేగా బాబు దీనికి సిద్ధపడింది.

లక్ష్మి : ఏవిటి నాన్న, మీరు గూడా. అంతా అయిపోయినట్టే మాట్లాడుతున్నారు. అదేం ఉండదు. నాకు తెల్సు.

వరం : ఏం కాదు నే చెప్తున్నది నిజం ప్రసన్న రాకపోతే ఫినిష్ – ఎవరూ ఆపలేరు. ఆశ్చర్యంగా వుందే ?

వెంక : అయితే పిల్ల సాయంత్రం లోపల రావడం జరగని పని – రేపో ఎల్లుండో వస్తుంది.

లోక : ఎప్పుడొచ్చినా ఫర్వాలేదు వస్తే చాలు

వరం : ఏం కాదు. సాయంత్రం లోపల రావాలి. లేకపోతే – ఆశ్చర్యంగా ఉందే ?

లక్ష్మి : సరే బాబు ఇంతగా చెప్తుంటే కాదని, ఎలా అంటాం సరేనాన్న వెళ్ళి అవన్ని పట్టుకునా.

వెంక : సరేనమ్మ వెళ్ళి చిటికెలో పట్టుకొస్తా. నువ్వు రావయ్య అసలే నాకు కంగారుగా వుంది.

లోక : పదండి. ఆ ఇనిస్టిట్యూట్‌కి వెళ్ళి వాడి ఫ్రెండ్సుందరికి చెప్పొద్దాం అంతా దగ్గరుంటారు. ( లోకనాథం, వెంకటప్పయ్యలు బయటికి వెళ్ళారు )

వరం : ఏవండీ ! మీకోసంగతి చెప్పనా ! చెప్పినా నమ్మరు !

లక్ష్మీ : ఏమిటి బాబు అది .

వరం : అబ్బే ఏంలేదు నన్ను కాస్త ఒంటరిగా ఉండనిస్తారా....

లక్ష్మీ : ప్రసన్నగురించి తీపి సంఘటనలు గుర్తు చేసుకుంటారా ?

( రామాంజనేయులు పేపరుతోవచ్చి )

రామ : ఏరా వరం ఏవిట్రా యిది ఈ ప్రకటనలేమిటి ? ప్రాణ త్యాగాలేమిటి ? ఎవర్రా ప్రసన్న ? ఎక్కడుంది ?

వరం : తెలీదు. అందుకే ఈ ప్రకటన

లక్ష్మీ : మీరేం ! కంగారు పడకండి. కుర్రాళ్ళు ఏదో ఆవేశంలో

రామం: ఏరా ! అంతే అని ఒక్కముక్క చెప్పరా. ఇదంతా తమాషాకి చేసా నాన్న అని ఒక్కమాట చెప్పరా. నా మనసు కుదుట పడుతుంది. దడ, తగ్గుతుంది. చెప్పరా !

లక్ష్మీ : కన్నతండ్రి అంతగా ప్రాదేయపడితే అడుగుతుంటే మాట్లాడవేం బాబు. చెప్పు ఇదంతా నాటకం – ఆ ప్రసన్ననని భయపెట్టటానికి చేసిన పని అని చెప్పు.

వరం : సారీ చెప్పలేను. చెప్పను గూడా. ప్రసనన్నని నేను నిజంగా మనసారా ప్రేమించా పిరికితనంతో చెప్పలేకపోయినంత మాత్రాన నా ప్రేమ దొంగ ప్రేమకాదు. ప్రసన్న లేకుండా నేను జీవించలేను. అంతే.

రామం : రేయ్ వరం. అలా అనకురా. నీకోసం , నీ మీద ప్రాణాలు పెట్టుకొని బతికాన్రా అమ్మలేని నిన్ను అల్లారు ముద్దుగా పెంచుకున్నది ఇందుకా ? నా భాద అర్థం చేసుకోరా తండ్రిగా నాపై కనికరం లేకపోయిన కల్సి బతికిన స్నేహితుడిగా అడుగుతున్నా. ఈ మొండి తనం వదల్రా .

లక్ష్మీ : పర్లెండి... అతనికి కాస్త టైమివ్వండి. ఆవేశం తగ్గాక ఆలోచించుకొని చెప్తాడు. మీరు పదండి.

వరం : కొత్తగా చెప్పడానికి, సరికొత్తగా ఆలోచించడానికి ఏమీ లేదు. సాయంత్రంలోగా ప్రసన్నరాకపోతే....

రామం : సరేరా ! నీమాటనీదయితే – నీ పట్టుదలే నీకు ముఖ్యమయితే నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో, నీతో పాటు నేను చస్తాను. ఏ గొడవా ఉండదు.

లక్ష్మీ : ఏవండి ...ఏవండి ! మిమ్మల్నే ఏం బాబు నాన్నగార్ని అలా హింసపెట్టొచ్చా చదువు కున్నవాడివి. ఆయన సంతృప్తి కోసం ఓ అబద్ధమన్నా చెప్పేచ్చుగా.

వరం : ఛీ! ఛీ! నా బుర్ర పాడైపోతోంది.

దొంగ : ఛ...నీయమ్మ ఇంక బతకడం దండగా...

వరం : ఎవరు బతకడం ? నేనా ?

దొంగ : నీ గురించి కాదురా అమ్మ ఇచ్చిన ఆ లాకెట్టు పోగొట్టుకుని బతకడం దండగ సాయంత్రం లోపల దొరికిందా సరే లేదూ. ( జేబులోంచి సీసా తీసి ) ఈ విషం తాగి చచ్చిపోతా. పైన అమ్మని కల్సుకోవచ్చు.

వరం : అది పాయిజనా ?

దొంగ : లేకపోతే పాయాసం అనుకున్నావా?
( సీసా టేబుల్ మీద పెట్టి మళ్ళీ వెతుక్కుంటున్నాడు )

వరం : రావుడు ...నిన్నే...

దొంగ : దొంగ.....దొంగరావుడు

వరం : అదే దొంగరావుడు నీకో సంగతి చెప్పనా ? పేపరు చూసావా ?

దొంగ : అలవాటు లేదు విషయం చెప్పు.

వరం : సాయంత్రం లోపు ప్రసన్న రాకపోతే చచ్చిపోతానని, నా పేర్న పేపర్లో ఫోటో వేసి ప్రకటన ఇచ్చారు.

దొంగ : అంటే ఇచ్చింది నువ్వు కాదా ?

వరం : కాదు అదే ఆశ్చర్యం !

దొంగ : ఆ విషయం నలుగురికి చెప్పెయ్యి – సరిపోతుంది.

వరం : ఆ ! సరిపోతుంది. నీకేం అలానే అంటావు. తీరా ప్రసన్న ఆ ప్రకటన చూసి వచ్చేసరికి ఇంకా బతికేవుంటే నన్ను నా ప్రేమని నమ్ముతుందా ? ఈ సారి నిజంగా ఛస్తానన్న నమ్మదు.

దొంగ : అయితే సుఖంగా చచ్చిపో...

వరం : కాని చూస్తూ చూస్తూ ఎలా చావడం ?

దొంగ : అయితే చచ్చినట్టు బతుకు. అయినా పిరికి నాయాల. నీకెందుకురా ఈ ప్రేమలు , దోమలు, తప్పుకో ( టి.వి. పొడ్ర్యూసర్ వాణీ నాథం ఎంట్రీ )

వాణి : సార్ వరప్రసాదం అంటే మీరేనా.

వరం : అవును మీరెవరు ?

వాణి : చెప్తా మిమ్మల్ని బతికుండగా కల్సుకున్నందుకు వెర్రి ఆనందంగా ఉంది సార్. నా పేరు నాథ్, వాణీ నాథ్ వీడియో ప్రొడ్యూసర్ని మీ ప్రకటన చదివి పరిగెత్తుకుంటు వచ్చా.

వరం : దేనికి ? నా చావుకు వీడియో కవరేజ్ కూడానా ?

వాణి : మామూలు కవరేజ్ కాద్సార్. ప్రేమకు వీరే వారసులు అనే ధారావాహికంలో ఒక వారం మీ ప్రేమ చావు కథని సజీవంగా చూపిస్తాం. ఇతను నా అసిస్టెంట్ ఫిడేల్ రాజ్.

వరం : నాకు ఏవిటోగా ఉంది.

వాణి : వుంటుంది ప్రాణత్యాగం అంటే మాటలా .
అవున్సార్ మీ ఆత్మాహుతి కార్యక్రమం ఇక్కడేనా లేక సర్దాగా ఏ గార్డెన్లోన్న పెట్టుకుంటావా ? అహ ఏం లేదు ఫ్రేము అందంగా తీసుకోవచ్చు.

వరం : శ్రీరామచంద్ర ! చూడండి.

వాణి : నా పేరు వాణీనాథ్ ఇక్కడే అయితే రూమ్ని బాగా డేకరేట్ చెయ్యాలి.
ఇక్కడే ఫ్లవర్ వాజ్ అక్కడ ఆయిల్ పెయింటు, ఇక్కడ ట్రాలీ వేసుకుని ఇలా వెడితే
( దొంగరావుడు ఎదురొచ్చాడు )
ఎవర్సార్ అతను. లొకేషన్స్ చూసుకుంటున్నాడు. కొంపదీసి ప్రైవేట్ ఛానల్కి కమిట్ అయిపోయారా ?
( లక్ష్మీ గ్లాసులో పాలు తెచ్చింది )

లక్ష్మీ : ఈ పాలు తాగుబాబు. చావడానికైనా ఓపికుండొద్దు.

వాణి : నమస్తే మేడమ్ , నా పేరు వాణీనాథ్. వీడియో ప్రొడ్యూసర్ని కవరేజ్కి వచ్చా. అవును ఇంతకీ ఎలా చస్తారు. ఉరేసుకునా.

లక్ష్మీ : ఉరి వద్దండి. కళ్ళు వుబ్బి భయంగా వుంటుంది శవం. వాణీ అవునవును ఫ్రేములో బ్యూటీ పోతుంది. అయితే మరి పాయిజన్ తీసుకుంటార ?

లక్ష్మీ : ఏం బాబు చెప్పు, నీ ఇష్ట ప్రకారమే కానిద్దాం.

వరం : ( కసిగా ) గొంతుపిసికి చంపండి.

వాణి : బాగానే వుంది కాని పసికే వాళ్ళు ఎవరూ ? చచ్చేవాడు ఎలా వున్నా చంపేవాడు. అందంగా వుంటే షాట్స్ బాగా ఉంటాయి. మీరు గొంతు పిసకండి. మేడమ్ ఎవరో దేనికి .

లక్ష్మీ : ఏం బాబు ?

వరం : అబ్బ నా ప్రాణాలు తీయకండి,. పొండి

వాణీ : భలేవారు సార్. మేం మీ ప్రాణాలు తీస్తున్నామా ? మీరు ఛస్తున్నారు. మేం చుట్టేసుకుంటున్నాం. అంతే సరే వెళ్ళి యూనిట్ వాళ్ళని రమ్మని ఫోన్ చేసొస్తా. ఆలస్యం అవుతుందని ఖంగారు పడకండి చక్కగా, మెల్లిగా రిచ్చిగా తీసుకుందాం పదరా.

వెంక : బాబు ఇంకా బతికేవున్నావా ? హమ్మయ్య నాకు వాచీలేక టైం తెలీక ఆలస్యం అయిపోయిందని పరిగెట్టుకునొచ్చా.

వాణి : టి.వి. లేదు. సినిమా లేదు. నువ్వెవరయ్యా బాబూ. అమ్మాయి – ఆ పిల్ల అదే మన సరస్వతి వస్తుందంటావా ? రాకపోతే ఎలా .

లక్ష్మీ : తప్పకుండా వస్తుంది నాన్న. నాకు నమ్మకం వుంది. ఇతన్ని ఆ ప్రసన్న నిజంగా ప్రేమించి ఉంటే ఎక్కడున్నా పరిగెత్తుకుంటూ వస్తుంది. రాకపోతే అది ప్రేమా కాదు ఆ పిల్ల ప్రసన్నకాదు.

వరం : అబ్బ ఎంత ధైర్యంగా చెప్పారు ? అవును ప్రసన్న వస్తుంది నాకు తెల్సుకాని ఇంకో ఊళ్ళో వుంటే ఎలాగని .

వాణి : ఏమిట్సార్ .....ఇంతకీ ప్రోగ్రాం వున్నట్టేగా ! సార్.... మీరు మనస్సు మార్చుకుంటే నే చచ్చూరుకుంటా ఇరవై వేలు లాసు. టి.విలో లాస్ ఆఫ్ ఫేస్.

వెంక : అదికాదయ్య ఆ ప్రకటన ఇచ్చేముందు కాస్త పెద్దవాళ్ళతో సంప్రదించొచ్చుగా ? కనీసం ఫోన్ చెయ్యమని ప్రక్కవాళ్ళ నెంబరిచ్చుంటే ఎంత సదుపాయంగా ఉండేది ?

వరం : ఏమండీ ! మీకో సంగతి చెప్పనా ? అసలా ప్రకటినిచ్చింది నేకాదు. నమ్ముతారా ?

వెంక : నువ్వు కాదా ఎందుకయ్యా ప్రేమిస్తావు. ప్రేమట ప్రేమ. టైం దగ్గర పడుతుంటే గుండె దడ పెరిగేసరికి ప్రకటనిచ్చింది నేను కాదంటావా ? ఎవరూ ఇచ్చింది నేనా ? నా పిల్లా ! ఇతనా .?

వాణి : నేను కాద్సార్. మనకి వర్కవుట్ కాదు. మాష్టారూ ! యూనిట్ ఇంకా రాలేదండి మీరు రెడీగా వుండండి. నేవెళ్ళి ఫోన్ చేసి వస్తా.

లక్ష్మీ : చూసావా ? నాన్న అక్క వస్తుందనేసరికి ఆ ప్రకటనిచ్చింది, నేను కాదని ఎలా తప్పుకున్నారో అక్క రాకుండా ఉంటేనే నయం.

వరం : ఇదెక్కడి గొడవరా బాబూ ? అది కాదు వెంకటప్పయ్య గారూ .

వెంక : వెంకటప్పయ్య గారా ? నా శ్రాద్ధమా ! నా సరస్వతి రాని ఇంట్లో నేను క్షణం కూడా ఉండను. అమ్మాయ్ లక్ష్మీ లక్ష్మీ !

వరం : అంతా ఆశ్చర్యంగా ఉందే ! మనసులో మాట చెప్పుకోడానికి దిక్కులేకుండా పోయిందే ! ( లోకనాథం వచ్చాడు ) అమ్మయ్య మావయ్య వచ్చానా ? అసలేం జరిగిందంటే ....

లోక : ఏమిట్రా మనషి కనబడితే వెధవసోది.... పోయి రామా..కృష్ణా అనుకోరాదూ . లక్ష్మీ లక్ష్మీగారూ ?

వెంక : ( బయటకి వచ్చాడు ) లక్ష్మీ అమ్మాయి లక్ష్మీ ? ఇదేంటి లక్ష్మీ ఏమయింది ?

లోక : ఒరేయ్ లక్ష్మీ కన్పించడంలేదురా.... మీ నాన్నేడి ? ఏమయ్యాడు ?

వరం : ఆ గదిలో వున్నాడు.

లోక : ఒకడేనా ? బావా...బావా ! బయటికిరా లక్ష్మీ కన్పించడం లేదు.

వెంక : లక్ష్మీ ! ఏమయ్యావ్ ? ఇప్పుడేగదామ్మా లోపలికెళ్ళావు.

వరం : మళ్ళీ ఏ కుక్కయినా ఎత్తుకెళ్ళిందేమో ?

లోక : ఆపరా ! వెథవ జోకులూ నువ్వూనూ బావా ! బావా రామాంజనేయులు గది తలుపులు తెరిచి బయటకు వచ్చాడు )

రామా : ఏమిటి ? లక్ష్మీ కన్పించడం లేదా ? ఏమైంది ? ఏరా ! మాట్లాడరేం ?

లోక : హమ్మయ్య లోపల్లేదు బావా నిజం చెప్పు. లక్ష్మీనేం చేశావ్ ? ఎక్కడ దాచావ్ ? చెప్తావా ? పోలీసు రిపోర్టిమ్మంటావా .

రామం : ఆ మాటే నేనూ అంటున్నాను. చెప్పు లక్ష్మీ నేం చేశావ్ .

వాణి : ఈ లక్ష్మీఎవరండీ ? సడెన్‌గా కథ మారింది. మీరంతా అలా గదిలోకి వెళ్ళి పోట్లాడుకోండి నేనిక్కడ షూటింగ్ ఏర్పాట్లు చేసుకోవాలి.

రామం : నువ్వెవడ్రా ? నన్ను బయటికి పొమ్మనడానికి, వరం ! లోపలికి పదరా ! నా మాట వినరా ?

వరం : నాన్న, నీనాటకం నాకు తెలుసు, లక్ష్మీని దాచేసి ఆ గందరగోళంలో నా కార్యక్రమం వాయిదా వేద్దామనేగా నేనేం ఫూల్‌నికాను. నేను చచ్చే తీరతాను. త నన్నెవరూ ఆపలేరు.

వాణి : అహ ! ఏం కుర్రాడండీ ! బంగారపు లాంటివాడు యూనిటింకా రాలేదు సర్ మీరంతా ఓ పక్కన కూర్చోని ఏడుపు ప్రాక్టీసు చేసుకొండి మనింట్లో సాంబ్రాణి ఉందా .

లోక : ఉండవయ్యా ఏమండీ వెంకటప్పయ్య గారూ లక్ష్మీ ఏవైనట్టు. ?

వెంక : మర్యాదగా చెప్పండి మీలో ఎవరో నాకూతుర్ని మాయం చేశారు ఒక పిల్లను కుక్కలెత్తుకెళ్ళి , ఇంకో పిల్లని మనుషులెత్తుకు పోతే నేనెలా బతికేది .

లోక : బావా ! ఆ తండ్రి మనసెంత బాధపడ్తుందో చెప్పు ఏం చేశావ్ ?

రామా : నువ్వు చెప్పాలి. ఆ లక్ష్మీని మాయం చేసింది నువ్వే...

వరం : నాన్న ఆపుతారా ముందుగానే చచ్చిపొమ్మంటారా ?

వాణి : కాస్తాగండి యూనిటొచ్చేస్తుంది.

దొంగ : ఒరేయ్ ! మీకేమైనా బుద్ధి ఉందిరా ఆ చచ్చిపోతున్న కొడుకుని వదిలేసి మీలో మీరు కొట్లాడుకుంటార్రా సిగ్గులేదంట్రా !

వరం : అది కాదు దొంగరాముడూ ! అసలు.....

దొం : ఒరేయ్ పిరికి నాయాలా ప్రేమించినోడివి ఆ భయం దేనికిరా. ఆ పిల్ల వస్తుంది. నువ్వు బతికే ఉంటావ్.

వాణి : అదేంట్సార్. నా సంగతేం కాను. ఎంతలాసు ?

దొంగ : నువ్వెళ్ళి మొహం కడుక్కుని టిఫిన్ చేసిరా నే చెప్తాగా ఊ....

వరం : సరే ! మీరు చెప్తున్నారు కాబట్టి వెళ్తున్నా.

రామం : వరం ఆగు ! నేను వస్తున్నా.

దొంగ : ఒరేయ్ ఇలా రండి. మీకు బుర్రలున్నాయిరా ? చూస్తూ, చూస్తూ ఓ పిచ్చి వెధవ చచ్చిపోతానంటుంటే కాపాడే ఉపాయం ఆలోచించలేర్రా !

లోక : ఉపాయామా ?

వెంక : ఏం చెయ్యమంటారు ?

దొంగ : మీరేం చెయ్యనక్కర్లా నేనే ఏర్పాటు చేశాను... మీ లక్ష్మిని బయటకి పంపించింది నేనే.

లోక : నువ్వా ?

వెంక : ఎక్కడికి పంపించావ్ ఎలా పంపించావ్ ? అంతా ఇక్కడే ఉన్నాంగా

దొంగ : దొడ్డి తలుపులు తీసి పంపించి మళ్ళీ తలుపులు మూశా. మీ లక్ష్మీ ఆనా కొడుకు ప్రేమించిన పిల్లా ఒక్కలాగే ఉంటారని చెప్పారా !

వెంక : అవును ! సరస్వతి దాని పేరు చిన్నప్పుడు ....

దొంగ : కుక్కెత్తికెళ్ళింది అద్సరే ఆ లక్ష్మిని ఇలా పంపించి అలా ప్రసన్నలాగా తెప్పించి, ఆ నా కొడుక్కి చూపిస్తే సంతోషిస్తాడా లేదా ?

లోక : అహ ! అద్భుతం ! ఏమాలోచన !

వెంక : నిజమేనయ్యా నాకు తట్టనేలేదు.

వాణి : ఏంట్సార్ ? అసలు ప్రోగాం ఉందా ? లేదా ?

దొంగ : కాసేపట్లో లక్ష్మి ప్రసన్నలా వచ్చి వాల్తుంది. ఆ వెధవకి చెప్పకండి

( వరం చాటునించి మొత్తం విన్నాడు. అక్కడికి వస్తూ )

వరం : ఓహో ! అంటే లక్ష్మీని నాకు చూపించి, ప్రసన్నంటే నమ్మేసి మనసు మార్చుకుంటానని మీ ఉద్దేశమా ?

వెంక : బాబూ ! మొత్తం విన్నావా ?

లోక : అది కాదురా వరం

వరం : నాకు చెప్పకండి నాకు ప్రసన్న దగ్గర నా పరువు ముఖ్యం ప్రాణాలు కాదు. నేను చావడం ఖాయం. ఇంకా ఎంత టైముంది .

దొంగ : ఛీ ! ప్లానంతా పాడైంది. అయితే తన్నుకు ఛావండి. రేయ్ ఇక్కడ నా పాయిజన్ సీసా ఏమైంది.

వరం : నాకు తెలీదు నాన్న నేను పోవడం ఖాయం నిర్ణయం జరిగిపోయింది.

రామం : అదేమిట్రా మళ్ళీ మొదటికొచ్చావ్ !

వాణి : సార్, త్వరగా కానీండి , అంతా పక్కకి రండి,. సార్ మీరలా కూర్చోండి.

వరం : అవును ఇంతకీ ఎలా చావడం ?

వాణి : ఏంటి సార్ పాయిజన్ సీసా లోపల పెట్టుకొని ఎలా చావమంటారు అని అడుగుతున్నారు. అబ్బ గొప్ప చతురులే .

రామం : రేయ్ తొందరడపుకురా, ఆ వుద్దేశం విరిమించుకుంటున్నానని స్పష్టంగా చెప్పు

వరం : లాభం లేదు నాన్న మనసు మార్చుకొని నా ప్రసన్న ముందు , ప్రపంచం ముందు దోషిలా నించొని నవ్వుల పాలవడంకన్నా .....

వెంక : ఆపవయ్యా అంత తొందర దేనికీ మెల్లగా పోవచ్చుగా

వాణి : రెడీ సైలెన్స్

రామ : ఆగరా వరం ! ఆ ప్రసన్నని వెతికి తీసుకొచ్చి నీకు పెళ్ళి చేస్తా దేవుడి మీ దొట్టురా ! ( బయట నించి ప్రసన్న కంగారుగా వచ్చింది )

ప్రసన్న : వరం వచ్చేశా వరం ! నీ కోసం నిన్ను బ్రతికించుకోవడం కోసం వచ్చేశా వరం నేను నీ దాన్ని

వరం : అహ ! వచ్చేశావా ప్రసన్న ఏ వూరు నుంచి వచ్చావు. పేపరు చూశావా ?

ప్రసన్న: చూశా ! అందుకే లారీ ఎక్కి మరీ వచ్చా...

వరం : అలాగా ! ఎంత ప్రేమ నేనంటే....

రామా : నువ్వేనమ్మా ప్రసన్నంటే అచ్చు లక్ష్మిలాగే ఉంది.

వెంక : వాళ్ళు కవలపిల్లలు బాబు...చిన్నప్పుడు కుక్క....

వాణి : ఆపరా బాబు.... ఏమండీ ఏమిటి ఆసల్యం....

లోక : ప్రోగ్రాం కేన్సిల్ ప్రసన్నొచ్చేసిందిగా, ఏరా వరం.

వరం : వచ్చింది ప్రసన్నకాదు నన్ను మీరు మోసం చేయలేరు. ప్రసన్నని నేను వంద మందిలో వున్నా గుర్తించగలను.

ప్రసన్న: కాదు వరం ! నే నిజంగానే ప్రసన్నను నా మాట నమ్ము ఆ సీసా ఇటియ్యి.

వరం : ఇవ్వను లక్ష్మిగారు ఇవ్వను.. పెద్ద వాళ్ళకు నా బాధ అర్ధ ంకాకపోవచ్చు కానీ మీరైనా నా మనస్సును అర్ధం చేసుకోండి ప్రేమంటే మోసం కాదు. నే పిరికి వాణ్ణే కాను. దొంగను కాదు.

లక్ష్మీ : ఎంత మంచివాడివి వరం ! నీ మనస్సు తెలీక నిన్ను బాధపెట్టాను. నన్ను క్షమించు.

వరం : క్షమించడానికి మీరేం చేశారు లక్ష్మిగారు ! తప్పు చేసింది నేను పిరికి తనంతో ప్రసన్నను దూరం చేసుకుంది నేనె. ఎవరో గాని ఈ ప్రకటనిచ్చి నాకర్తవ్యం గుర్తు చేశారు.

లక్ష్మీ : ఆ ప్రకటన ఇచ్చింది కూడా నేనే వరం నా మాట నమ్ము నిన్ను రెచ్చగొట్టి నీదాన్ని కావాలన్న ఆలోచన తప్ప నిన్ను దూరం చేసుకోవాలని కాదు. నన్ను నమ్ము ఆ సీసా ఇటియ్యి.

వెంక : అవునయ్యా ఆ పిల్ల ప్రసన్నే నేను ఆ పిల్ల తండ్రిని కాదు ఇదంతా ప్రసన్నాడించిన నాటకం

లోక : నిజంగానా !

వరం : మీరెంత మంచి వాళ్ళు నన్ను బ్రతికించుకోవడం కోసం ఎన్ని అవస్థలు పడుతున్నారు.

రామం : ఒరేయ్ ! ఏవిటిరా ఈ సస్పెన్సు ఆ సీసా అవతల పారెయ్యి.!

లక్ష్మీ : వరం నా మొహం చూడు నా కళ్ళల్లోకి చూడు నేను నీ ప్రసన్ననని లక్ష్మి నేనాడిన నాటకంలో పాత్ర అంతే !

వరం : నేన్నమ్మను లక్ష్మిగారూ నాప్రసన్న ఎప్పుడూ ఇలా చెయ్యదు. నన్నాపకండి నాన్న వెళుతున్నా.

రామం : ఒరేయ్ ఆగరా ఇదేక్కడి ప్రారబ్దంరా !

లోక : ఒరేయ్ ! ఆ పిల్ల ప్రసన్నకాక పోతే రేపు చావు.

వాణి : స్పీడ్‌గా ఫాస్టుగా బాగా యాక్ట్ చేయండి ఊ...!

వెంక : బాబు నిలువునా ప్రాణాలు తీసుకోకు ఆలోచించు.

వరం : అందరికి వందనం నన్ను క్షమించండి

( వరం సీసా ఎత్తి గడగడా తాగాడు )

దొంగ : నిజంగా తాగాడ్రా నిజాయితీగల నా కొడుకే

రామం : ఎంత పనిచేశావురా ! నేనెలా బ్రతికేదిరా

వెంక : రామ ! రామ ! చూస్తారేమండి. త్వరగా ఆసుపత్రికి తీసుకుపోదాం.

వరం : వద్దు కావాలని చచ్చేవాడిని మందులూ మాకులూ దేనికి నాన్నరేపు ప్రసన్నగాని ఏడినా వరం అంటే నన్ను క్షమించమని చెప్పండి మంచికుర్రాడిని పెళ్ళి చేసుకోమని చెప్పండి.

లక్ష్మి : అయ్యో వరం నేనే ప్రసన్నని. ఇంకా అర్ధం కాలేదా ! నిన్నేలా నమ్మించేది ఏమండీ ! త్వరగా డాక్టరుని పిలిపించండి నావరం బ్రతకాలి.

వరం : లక్ష్మీ నువ్వు నిజంగా ప్రసన్నావా ? మూగదానివా, కాకులు కుక్కలూ.

వెంక : అంతా నాటకం బాబూ, నాటకం నిన్ను ఉడికించడానికి ఆడిని నాటకం.

రామం : ఏమ్మా ! నాటకాలాడడానికి నా కొంపే దొరకిందా ? నా కొడుకే దొరికేడా వరం పదరా ఆసుపత్రికి పోదాం.

వరం : ఎంత పనిచేశావు ప్రసన్నా విషం త్రాగాక విషయం అర్ధమైంది. నిన్ను నమ్మాను ప్రసన్నా. నేను లక్ష్మిని అన్నావు నమ్మాను. ఇప్పుడే కాదంటున్నావు నమ్ముతున్నాను కానీ ఆలస్యం అయిపోయింది వెళ్ళిపోతున్నా.

రామం : ఒరేయ్ ఆటో పిలవరా ! నే వున్నారా నిన్ను బ్రతికించుకుంటా అంతా తప్పుకోండి.

వరం : ప్రసన్నా ఇలారా నా ప్రక్కన కుర్చో ఆనందంగా కళ్ళు మూసే అదృష్టం నాకు ప్రసాదించు ప్రసన్నా నాన్న ! తల బరువైపోతోంది కళ్ళు వాలిపోతున్నాయి వాంతి వచ్చేలాగా...

రామం : పట్టండిరా ఒరేయ్ దొంగరాముడూ సాయం పట్టు.

వెంక : లాభం లేదండి ! అంతటైం వున్నట్టులేదు. డాక్టరును పిల్చుకురావడమే నయం

వరం : నాన్న ...నాన్న ..ప్రసన్నా ..ప్రసన్నా వెళుతున్నా ప్రస...అని తలవాల్చేశాడు.

రామం: వరం నాయనా వరం ....వెళ్ళిపోయావురా పిచ్చితండ్రీ

లక్ష్మి : ఆ పాపం నాదే.నేనే చంపుకున్నాను. నేను పోతాను నన్నొదలండి.

లోక : ఛీ....ఛీ మావయ్య అంటూ వెంట తిరిగేవాడూ

వెంక : ఆకారణంగా నన్ను ఈ నాటకంలో పాత్రను చేసి పాపం చేయించావు కదమ్మా.

వాణి : వెరీ గుడ్ .. సీన్ చాలా బావుంది. అంతకన్నా ఎక్కువైతే లెంగ్తు ప్రాబ్లం వస్తుంది. యూనిట్ వచ్చేసినట్లుంది.

దొంగ : నువ్వేమిత్రా తప్పుకో వాడుపోయాడు.

వాణి : యూనిట్ రాకుండా అతను విషం తాగితే నాగతేం కాను. అంచేత సీసాలు మార్చా వాడు తాగింది విషం కాదు.

లోక : విషం కాదా మరి చచ్చిపోయాడేం ?

(టక్కున వరం లేచి కూర్చుంటూ )

వరం : ఆ ! విషం కాదా ! అదే అనుకున్నా పాయిజను ఇంతా తియ్యగా వుందేమిత్రాని

రామం: బ్రతికించావురా దేవుడా మీ పేరేమిటో నా కొడుకుని నాకు దక్కించారు.

వాణీ : అదేం కుదర్దు ఈసారి నిజంగా విషం తాగాలి అంతా తప్పుకోండి రెడీ ! అన్యాయం మోసం ....ఛస్తా...ఛస్తా అని ఇలా మనసు మార్చుకుంటే ప్రోగ్రాంలెలా చెయ్యటం మాటపై నిలబడాలి.

లక్ష్మి : వరం నన్ను క్షమించు.

వరం : కాదు ప్రసన్న తప్పునాది, నువ్వే క్షమించాలి.

వెంక : సరిపోయింది అయ్యా మీరు క్షమించాలి. నా కూతురు పెళ్ళి గురించి ఈ వూరొస్తే నా చేత పెద్ద వేషం వేయించింది. ఇకనైనా వాళ్ళిద్దరికి ముడివెయ్యిండి.

రామం : బుద్ధొచ్చింది ప్రేమను పెంచాలి కాని చంపరాదని తెలిసొచ్చింది. చిన్నవాళ్ళ ఆనందంకన్నా పెద్ద వాళ్ళు మరెం ఆలోచించకూడదు. కులాలు, మతాలు, ఆస్తులు, అంతస్దులు అన్నీ అపశృతులు. ప్రేమ అనురాగం ఇవే శాశ్వతం అమ్మాయ్ చిన్నదానివైనా చక్కటి నాటకం ఆడి నా కళ్ళు తెరిపించావు.

వరం : నాన్న...అయిపోయిందిగా నువ్వెళ్ళి నీ పన్జూసుకో....వెంకటప్పయ్యగారు చాలా థాంక్యూ....

వెంక : అంటే వెళ్ళిపొమ్మనా ? పాపం చిన్నవాళ్ళు తొందరడపతున్నారు.

వరం : దొంగరాముడూ నీ లాకెట్ నే వెతికి పెడతాగానీ...

దొంగ : లాకెట్ పోయింది. పోయింది అన్నానా ఇదుగో నా జేబులోవుంది. అందువల్లే మీరు నన్నేం చెయ్యలేకపోయారు. వస్తారా అరేయ్ తప్పుకోండ్రా ఆళ్ళని ముద్దుముచ్చట్లు చేసుకోనివ్వండి మిమ్మల్నేరా. తప్పుకోండ్రా. అందరూ తప్పుకోండి ...వూ!
( అందరూ తలో వైపుకి వెళ్ళిపోగా అక్కడ వరం, ప్రసన్నలు మాత్రం మిగిలారు. వరం ప్రసన్నను దగ్గరకు తీసుకోగా )

------ తెర ------